గురువారం
12-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 201
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మేమొస్తేనే మార్పొస్తుంది!

టర్కీ కమ్యూనిస్టు పార్టీ

'టీకేపీ వస్తే మార్పు వస్తుంది!' అన్న నినాదంతో టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) త్వరలో జరగబోయే పార్లమెంటరీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది.

2లో

రాజ్యాంగ దినోత్సవంగా

రిపబ్లిక్ డే

లౌకికవాద పరిరక్షణ దినంగా గాంధీ వర్ధంతి

పార్టీ శ్రేణులకు సీపీఐ పిలుపు

న్యూదిల్లీ:
గణతంత్ర దినోత్సవాన్ని (జనవరి 26) రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని, గాంధీ వర్ధంతి (జనవరి 30)ని లౌకికవాద పరిరక్షణ దినంగా పాటించాలని పార్టీశ్రేణులకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. భారతదేశం లౌకిక-సంక్షేమ-ఫెడరల్ రాజ్యమని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పేర్కొనడాన్ని తాజా ప్రకటనలో గుర్తుచేశారు. రాజ్యాంగం మూలాలపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయన్నారు. విభజన-వర్గీకరణ-ఫాసిస్టు అజెండాతో దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషిచేయాలని, దీనిపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని పార్టీ శాఖలకు డి.రాజా పిలుపునిచ్చారు. జనవరి 26న పార్టీ కార్యాలయాలన్నింటిలో జాతీయ పతాకావిష్కరణ జరగాలని సూచించారు.

స్వాతంత్ర పోరాటంలో, గణతంత్రాన్ని సాధించడంలో పార్టీ పాత్ర గురించి ప్రజలకు తెలిసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయాలని డి.రాజా తెలిపారు. జనవరి 30 గాంధీ వర్ధంతని, ఆ రోజు యావత్ దేశం ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తుందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనే కాకుండా దేశానికి గణంతంత్రాన్ని సాధించడంలో గాంధీ కీలకపాత్ర పోషించారన్నారు. హిందూ-ముస్లిం ఐక్యత, దేశంలో మతసామరస్యం సందేశాన్నే ఆయన ఇచ్చారని గుర్తుచేశారు.

బీజేపీ- ఆర్ఎస్ఎస్ దేశ ప్రజలలో విద్వేషాన్ని రెచ్చగొడుతూ మతం-కులం పేరిట ఘర్షణలు సృష్టిస్తూ ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంచుతూ, దళితులు, గిరిజనులతో పాటు ఇతర మైనారిటీల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్న వేళ జనవరి 30వ తేదీని లౌకికవాద పరిరక్షణ దినోత్సవంగా జరపాలని పార్టీ శాఖలకు డి.రాజా పిలుపునిచ్చారు.

'నాటు నాటు'పాటకు

గోల్డెన్ గ్లోబ్ అవార్డు

మోదీ, జగన్, చంద్రబాబు అభినందనలు

ముంబై:
ప్రపంచ చలన చిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'గోల్డెన్ గ్లోబ్' అవార్డును 'ఆర్ఆర్ఆర్' సొంతం చేసుకుంది. ఒరిజినల్ సాంగ్ విభాగానికిగానూ 'ఆర్ఆర్ఆర్' నుంచి 'నాటు నాటు' పాటకు పురస్కారం లభించింది. ఈ మేరకు బుధవారం కాలిఫోర్నియాలోని ది బెవర్లీ హిల్టన్ హాల్ వేదికగా జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో రాజమౌళి, రామ్‌చరణ్, ఎన్టీఆర్, కీరవాణి కుటుంబసమేతంగా పాల్గొని సందడి చేశారు. 'నాటు నాటు'కు పురస్కారం ప్రకటించిన సమయంలో తారక్, రాజమౌళి, చరణ్.. చప్పట్లు కొడుతూ సందడి చేశారు. ఈ వీడియోలు నెట్టింట సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆర్ఆర్ఆర్ సినిమాకు దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వం వహించారు. ఈ పాటను చంద్రబోస్

- మిగతా 2 లో

ప్రభుత్వ ఉద్యోగులకు

సంక్రాంతి కానుక

- పండుగ రోజు ఒక డీఏ
- నెలాఖరులోగా మిగిలిన సమస్యలు పరిష్కారం
- ఏపీ ఎన్జీవో డైరీ ఆవిష్కరణలో జగన్ హామీ

ప్రభుత్వ ఉద్యోగులకు ఎట్టకేలకు కరువు భత్యంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నుంచి స్పష్టమైన హామీ లభించింది.

2లో

మావోయిస్టు 'హిడ్మా'

కాల్చివేత

తెలంగాణ-బీజాపూర్ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు

విశాలాంధ్ర-చింతూరు(అల్లూరిజిల్లా):
తెలంగాణ-బీజాపూర్ సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. తెలంగాణ గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్ కోబ్రా సంయుక్తంగా చేపట్టిన గాలింపులో మావోయిస్టులకు భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. భీకర పోరులో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా మృతి చెందినట్లు

- మిగతా 2 లో

పేదల ఇళ్ల కోసం

ఫిబ్రవరి 22న మహాధర్నా

- పోరుబాట పోస్టరు ఆవిష్కరణ
- జనవరి 17-30 తేదీల్లో సంతకాల సేకరణ
- ఫిబ్రవరి 6న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- ప్రజలంతా భాగస్వాములు కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, జగనన్న ఇళ్లు నిర్మించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 22న విజయవాడలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త అధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహాధర్నా తలపెట్టామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. ఈనెల 17 నుంచి 30 వరకు పెద్దఎత్తున పోరుబాటకు పిలుపునిచ్చామన్నారు. జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం లబ్ధిదారులకు కేటాయించాలన్న డిమాండ్‌తో ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ఆయన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్‌తో కలిసి పోరుబాట పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాదాపు 25వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అందులో అధికార నేతలు తిన్నంత తిన్నారనీ, పేదలకు మాత్రం సెంటు స్థలం ఇస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్లు ఇవ్వాలనీ, వారికి శాశ్వతంగా ఇళ్లు నిర్మించాలని తాము మొదటి నుంచి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. దానిపై జగన్ ప్రభుత్వం ఏ మాత్రమూ స్పందించలేదని మండిపడ్డారు. 32 లక్షల మందికి జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తామని సీఎం జగన్ చేసిన ఆర్భాటపు ప్రకటనకూ, ఆచరణలో పనులకూ

- మిగతా 2 లో

మంత్రి అంబటిపై

కేసు

గుంటూరు కోర్టు ఆదేశం

విశాలాంధ్ర-గుంటూరు లీగల్:
ప్రభుత్వం నిషేధించిన లాటరీలను లక్కీ డ్రా పేరుతో అమ్మకాలు జరుపుతున్నారన్న ఆరోపణలపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టాలని గుంటూరు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ సబ్ కోర్టు న్యాయమూర్తి ఎ.అనిత బుధవారం ఆదేశించారు. మంత్రి అంబటి రాంబాబు పర్యవేక్షణలో 'వైఎస్సార్ సంక్రాంతి లక్కీ డ్రా' పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటో కూడా ముద్రించి, సత్తెనపల్లిలో వైసీపీ నేతలు టికెట్లు అమ్ముతున్నారని జనసేన నేతలు

- మిగతా 2 లో

ప్రైవేట్ దందా

- టికెట్ రేట్లు 50 శాతం పెంపు
- పండుగతో రైళ్లన్నీ ఫుల్
- ప్రయాణికులకు నరకమే...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
సంక్రాంతి వచ్చిందంటేనే ప్రైవేట్ ట్రావెల్స్ దందాకు పెద్ద పండగ వచ్చినట్లే ఉంటుంది. సంక్రాంతి రద్దీని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని చార్జీలను భారీగా పెంచేశారు. సాధారణ రోజుల్లో ఉండే ధరల కంటే 50 నుంచి 100 శాతం వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. అటు రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. తూర్పు కోస్తా రైల్వే, దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక రైళ్లలో బెర్తులు ఖాళీ లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారికి చెమటలు పడుతున్నాయి. బుధవారం నుంచి సెలవులు కావడంతో కాలేజీ విద్యార్థులు, హాస్టళ్లలో చదువుకున్న విద్యార్థులంతా స్వగ్రామాలకు తరలి వెళ్లేందుకు నానాపాట్లు పడ్డారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు అత్యంత ప్రధాన పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పండక్కి తమ స్వగ్రామాలకు వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో గడుపుతారు. దీంతో రైళ్లు, బస్సులకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. కొంతమంది మూడు నెలల ముందే రైలు ప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకుంటారు. రిజర్వేషన్ దొరకనివారు, ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోనివారు ప్రైవేటు ట్రావెల్స్‌పై ఆధారపడుతుంటారు. అందుకే ఏటా సంక్రాంతి సీజన్‌లో ప్రైవేటు ట్రావెల్స్‌కు డిమాండ్ ఎక్కువగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!



వందే భారత్ రైలు వస్తోంది. పట్టాల మీదకు అడ్డంగా వెళ్ళకు, పాపం రైలు డామేజీ అవుద్ది!

పన్సారే కేసులో 10మంది నిందితులపై

అభియోగాలు నమోదు

ముంబై:
సీపీఐ నాయకుడు, హేతువాది గోవింద్ పన్సారే హత్యకేసులో పది మంది నిందుతులపై అభియోగాలు నమోదయ్యాయి. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకున్నది. మహారాష్ట్ర కొల్హాపూర్ ప్రత్యేక న్యాయస్థానం నిందితులపై బుధవారం అభియోగాలు నమోదు చేసింది. నిందితులలో సమీర్ గైక్వాడ్, వీరేంద్ర సింగ్ త్వాడే, అమోల్ కాలే, వాసుదేవ్ సూర్యవంశి, భరత్ కురానె, అమిత్ దేగ్వేకర్, శరద్ కలాస్కర్, సచిన్ అందూరే, అమిత్ బడ్డీ, గణేష్ మిస్కిన్ ఉన్నారు. వీరందరిపై ఉగ్రవాద నిరోధక బృందం ప్రత్యేక న్యాయమూర్తి ఎస్ఎస్ తంబే అభియోగాలు నమోదుచేశారు. ఐపీసీ సెక్షన్లు 302 (హత్య), 307 (హత్యకు యత్నించడం), 120-బి (నేరపూరిత కుట్ర)తో పాటు ఆయుధాలు అక్రమంగా కలిగి ఉండటం, వినియోగించడం వంటి ఆయుధాల చట్టం కింద కూడా అభియోగాలు నమోదు చేసినట్లు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది శివాజీరావు రాణె తెలిపారు. మరో ఇద్దరు నిందితులు వినరు పవార్, సారంగ్ అకోల్కర్ పరారీలో ఉన్నారు. ఈ కేసులో సాక్షుల జాబితాను, దర్యాప్తు సంస్థల పత్రాలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని, విచారణకు సిద్ధంగా ఉన్నారని వారి తరపు న్యాయవాది వెల్లడించారు. పన్సారే పన్సారే 2015, ఫిబ్రవరి 16న కొల్హాపూర్‌లో హత్యకు గురైన విషయం విదితమే.

ఆర్ఎస్ఎస్ హిందూ ఉన్మాదం

- ముస్లింలపై మరోసారి భగవత్ వివాదాస్పద వ్యాఖ్యలు
- మండిపడిన విపక్షాలు



న్యూదిల్లీ:
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దేశంలో ముస్లింలు ఆధిపత్యం వదులుకోవాలని ఆయన వ్యాఖ్యానించడం దుమారం రేపుతోంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి దేశంలోని ముస్లింలలో అభద్రతా భావం, భయం పెరిగిపోయిందనే విమర్శలు నానాటికి అధికమవుతున్నాయి. ఆర్ఎస్ఎస్ భావజాలమే ఇందుకు కారణమని ప్రతిపక్షాలు నిశితంగా విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో మోహన్ భగవత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'హిందూస్తాన్ హిందూస్తాన్‌గానే ఉంటుంది... ముస్లింలు భయపడాల్సిన అవసరం లేదు కానీ ఒకప్పుడు ముస్లింలు ఈ దేశాన్ని పాలించినందున మరోసారి పరిపాలిస్తామనే ఆధిపత్య భావజాలాన్ని వదులుకోవాలి. ఇక్కడ నివసించే హిందువులు, ముస్లింలు, కమ్యూనిస్టులు ఎవరైనా సరే ఈ భావజాలం వదులుకోవాలి' అని ఆర్ఎస్ఎస్ అనుబంధ పత్రికలు ఆర్గనైజర్, పాంచజన్యకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. వెయ్యి సంవత్సరాలకు పైగా భారతదేశంపై విదేశీయుల దురాక్రమణలు, విదేశీ కుట్రలు జరిగాయని అయినా నాటి నుంచి అవిభాజ్య దేశంగా ఉందని ఆయన పేర్కొన్నారు. నేడు హిందూ సమాజం మేల్కొందని చెప్పారు. సంఘ్ రోజువారీ రాజకీయాలకు దూరంగా ఉందని, అయితే మన జాతీయ ప్రయోజనాలు, హిందూ ప్రజల ప్రయోజనాలను ప్రభావితం చేసే రాజకీయాలతో ఎల్లప్పుడూ నిమగ్నమై ఉందని భగవత్ చెప్పారు.

భగ్గుమన్న కపిల్ సిబల్
మోహన్ భగవత్ వ్యాఖ్యలపై ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ మాజీ నేత కపిల్ సిబల్ మండిపడ్డారు. హిందూస్తాన్ హిందూస్తాన్‌లాగే ఉంటుందన్నప్పుడు మనుషులు మనుషుల్లానే ఉండాలిగా అంటూ మోహన్ భగవత్ వ్యాఖ్యలకు బదులిచ్చారు. ఆర్ఎస్ఎస్ ఓ వైపు అందర్నీ కలుపుకుని పోతామని చెబుతూనే ముస్లింలపై దాడుల్ని ప్రోత్సహిస్తోందని కపిల్ సిబల్ అన్నారు.

ఆయనెవరు అనుమతివ్వడానికి? ఒవైసీ
మోహన్ భగవత్ వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలు భారతదేశంలో నివసించడానికి, తమ

- మిగతా 2 లో

గ్రీస్ చివరి రాజు కాన్స్‌టెంటైన్-2 మృతి

దచ్‌వెల్లే: గ్రీక్ దేశ చివరి రాజు కాన్స్‌టెంటైన్-2 (82) ఏథెన్స్‌లో కన్నుమూశారు. గుండెపోటుకు గురై కాన్స్‌టంటైన్-2 మరణించినట్లు గ్రీక్ మీడియా పేర్కొంది. గ్రీస్ ప్రజాతంత్రం కాకముందు అంటే 1974లో ఈయన దేశాన్ని పాలించారు. యువరాజు పాల్ (కింగ్ జార్జ్2 తమ్ముడు), హాన్నోవర్ యువరాణి ఫెడరికాకు 1940, జూన్ 2న కాన్స్‌టెంటైన్ జన్మించారు. కాన్స్‌టెంటైన్ మొదటి పుట్టినరోజు కంటే ముందు రెండవ ప్రపంచ యుద్ధం క్రమంలో జర్మనీ దండయాత్ర నేపథ్యంలో గ్రీస్ నుంచి రాజకుటుంబం పారిపోయింది. కింగ్ జార్జ్-2 1946లో గ్రీస్‌కు తిరిగి రాగలిగారు. ఆ తర్వాత కొన్ని నెలలకు ఆయన మరణించారు. కాన్స్‌టెంటైన్‌ను కింగ్ పాల్-1కు వారసుడయ్యారు. కింగ్ పాల్-1 క్యాన్సర్ బారిన పడి 1964 మార్చి 6న మరణించారు. దీంతో రాజభారం కాన్స్‌టెంటైన్ భుజాలపైకొచ్చింది. అప్పట్లో సేయిలింగ్‌లో ఒలింపిక్స్‌లో స్వర్ణపతాకం సాధించి ప్రాచుర్యం పొందిన కాన్స్‌టెంటైన్‌కు ప్రజాదరణ కూడా ఉండటంతో రాజకీయ వ్యవహారాల్లో ఆయన చురుకుగా ఉండేవారు. 1967లో సైనిక తిరుగుబాటు జరుగగా దానిని తిప్పికొట్టలేని కారణంగా ఆయనకు అజ్ఞాతవాసం తప్పలేదు. ఆపై ఏడాదికి ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పటికీ ఆయన తిరిగి అధికార పీఠాన్ని అధీష్టించే అవకాశాలు లేకుండాపోయాయి.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఏపీ శకటం ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దేశ రాజధాని దిల్లీలో అంగరంగ వైభవంగా జరుగనున్న భారత గణతంత్ర వేడుకలకు ఆంధ్రప్రదేశ్ శకటం ఎంపికైంది. దీనిపై బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. కోనసీమలో ప్రబలతీర్థం పేరుతో, సంక్రాంతి ఉత్సవం ఇతివృత్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ శకటం ఈనెల 26న జరిగే పరేడ్‌లో పాల్గొనున్నది. వివిధ రాష్ట్రాల నుంచి రిపబ్లిక్ డే పరేడ్‌కు శకటాలను కేంద్రం ఎంపిక చేస్తోంది. ఈసారి దక్షిణ రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం కల్పించింది.

ఆధ్యాత్మిక క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఆధ్యాత్మిక ప్రదేశాలకు ప్రత్యేక ప్యాకేజీలతో ఏపీఎస్ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. తిరుమల, తిరుచానూరు, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ ఇంద్రకీలాద్రి, అన్నవరం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించేందుకు వచ్చే యాత్రికుల కోసం ఇప్పటి వరకు వివిధ ప్యాకేజీలతో కూడిన బస్సులు లేదా ట్రిప్పులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. ఇక నుంచి ఏపీఎస్ఆర్టీసీ ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించిందని, రాత్రి సమయాల్లో భక్తులు ఇబ్బంది పడకుండా వసతి ఏర్పాటు చేయడం, సంబంధిత పుణ్యక్షేత్రాల చరిత్ర, గొప్పతనం తెలియజేసేందుకు టూరిస్ట్ గైడ్‌లను కూడా అందుబాటులో ఉంచాలని యోచిస్తోందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి టూరిజం శాఖతో సంప్రదిస్తూ ప్రణాళికలు రచిస్తోందని, భక్తులను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్యాకేజీలు తీసుకొచ్చేందుకు సమాయాత్తమవుతోందని వివరించారు.

ఎయిడెడ్ టీచర్లకు నష్టం లేకుండా చూడాలి
ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపుదల అంశంపై సర్వీసు ఇంక్రిమెంట్లకు, పెన్షన్లకు నష్టం కలగకుండా సానుకూల ఉత్తర్వులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. 62 ఏళ్ల పెంపునకు సంబంధించి 2022 జనవరి 1 నుంచి 2022 నవంబరు 29 మధ్య ఎలాంటి వివరణ ఉత్తర్వులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆ కాలానికి సర్వీసు, ఇంక్రిమెంట్లు, పెన్షన్లకు నష్టం కలగకుండా సానుకూల ఉత్తర్వులు విడుదలని చేయాలని కోరారు.

విధులకు రాకపోతే సస్పెన్షన్ తప్పదు

సీఎం మాన్ హెచ్చరికతో వెనక్కు తగ్గిన పీసీఎస్ ఉద్యోగులు

చండీగఢ్: తక్షణమే విధులకు రాకపోతే సస్పెండ్ చేస్తానని పంజాబ్ సివిల్ సర్వీస్ ఉద్యోగులను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ హెచ్చరించారు. ఇష్టమొచ్చినట్లు సెలవులకు పిలుపిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల్లోగా విధులకు హాజరుకావాలని డెడ్‌లైన్ విధించారు. దీంతో సహచర ఉద్యోగి అరెస్టుకు నిరసనగా సామూహిక సెలవులకు ఇచ్చిన పిలుపును పంజాబ్ సివిల్ సర్వీస్ అధికారులు ఉపసంహరించుకొన్నారు. ఇదే విషయాన్ని పీసీఎస్ సంఘం అధ్యక్షుడు రజత్ ఒబేరాయ్ వెల్లడించారు. అంతకుముందు ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి ఎ.వేణు ప్రసాద్ ఉద్యోగులతో భేటీ అయ్యారు. సామూహిక సెలవు పిలుపును ఉపసంహరించుకోవాలని సూచించారు. దీంతో పీసీఎస్ అధికారులు సానుకూలంగా స్పందించారు. పీసీఎస్ అధికారుల సంఘం ప్రతినిధులతో సమావేశం సానుకూలంగా జరిగిందని, ఉద్యోగులంతా తక్షణమే విధుల్లో చేరతారని వేణు ప్రసాద్ విలేకరులతో అన్నారు. ఇదిలావుంటే, లూథియానాలో ప్రాంతీయ రవాణా అధికారి నరీందర్ సింగ్ ధాలీవాల్ ట్రాన్స్‌పోర్టర్ల నుంచి లంచం తీసుకొని అక్రమ వాహనాలకు చలాన్లు వేయడం లేదన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు.

ఆర్ఎస్ఎస్ హిందూ ఉన్మాదం

(మొదటిపేజీ తరువాయి)

విశ్వాసాలను అనుసరించేందుకు అనుమతి ఇవ్వడానికి మోహన్ భగవత్ ఎవరని ప్రశ్నించారు. 'అల్లా కోరుకున్నందు వల్ల మనం భారతీయులమయ్యాం. మన పౌరసత్వంపై షరతులు పెట్టేందుకు ఆయనకు ఎంత ధైర్యం? నాగపూర్‌లో ఉండే బ్రహ్మచారుల కోసం మా విశ్వాసాలను మార్చుకునేందుకు మేం ఇక్కడ లేం' అని ఒవైసీ అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం భారతదేశ భవిష్యత్తుకు ముప్పు అని, అంతర్గత శత్రువులు ఎవరనేది త్వరలోనే భారతీయులు గుర్తిస్తారని అసదుద్దీన్ అన్నారు. సభ్య సమాజం మతం పేరుతో ఇలాంటి విద్వేషాన్ని సహించదని చెప్పారు. హిందువుల ప్రతినిధిగా మోహన్ భగవత్‌ను ఎవరు ఎన్నుకున్నారని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ ఆధిపత్యాన్ని నమ్మే హిందువులు చాలా మంది ఉన్నారు. ప్రతి మైనారిటీ ఏమనుకుంటున్నాడో వదిలేయండి. సొంత దేశంలోనే మీరు విభజన బీజాలు నాటుతూ వసుధైక కుటుంబం అంటూ ప్రపంచానికి ఎలా చెప్పుకుంటారు? అని నిలదీశారు. ఇతర దేశాల్లో ముస్లిం నేతలను కౌగిలించుకునే ప్రధాని మోదీ సొంత దేశంలో ముస్లింలను ఎందుకు కౌగిలించుకోరని ప్రశ్నించారు.

మేమొస్తేనే మార్పొస్తుంది!

టర్కీ కమ్యూనిస్టు పార్టీ
పార్లమెంటరీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

అంకార: 'టీకేపీ వస్తే మార్పు వస్తుంది!' అన్న నినాదంతో టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) త్వరలో జరగబోయే పార్లమెంటరీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. సమసమాజ స్థాపనతో పాటు లౌకిక, స్వతంత్ర్య, ఆధునిక, పారిశ్రామికీకరణతో కూడిన టర్కీ నిర్మాణానికి కట్టుబడి ఉన్నట్లు తాజా ప్రకటనలో పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించింది. 1923 పోరాట స్ఫూర్తితో 2023 పార్లమెంటరీ ఎన్నికలకు నడుం బిగించినట్లు పేర్కొంది. నాటి తరహాలోనే నేటి అనైతిక ప్రభుత్వాన్ని గద్దెదించుదామని టర్కీ ప్రజలకు పిలుపునిచ్చింది. టర్కీ కమ్యూనిస్టు పార్టీకి ఓట్లు వేయాలని కోరింది. టర్కీ కమ్యూనిస్టు పార్టీ వస్తే అన్ని మారిపోతాయని నొక్కిచెప్పింది. తమ పోరాటానికి సంఘీభావం ప్రకటించడమే కాకుండా కలిసి రావాలంటూ పిలుపునిచ్చింది. టర్కీ కమ్యూనిస్టు పార్టీకి ఓటు వేయడం ద్వారా సమసమాజ స్థాపనకు ముందడుగు పడుతుందని పేర్కొంది. టర్కీ కమ్యూనిస్టు పార్టీ రాకతో ప్రతీది మారిపోతుందని నమ్మాలని, ఈ విషయాన్ని మరువద్దని టర్కీ ప్రజలకు సూచించింది. 'లౌకిక, స్వతంత్ర, ఆధునిక, పారిశ్రామిక టర్కీ నిర్మాణమే ఆకాంక్షిస్తున్నాం. అప్పుడే ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుంది. అసమానత్వం, వివక్షకు చెక్ పెట్టొచ్చు. అంతకంటే ముందు నిసిగ్గు కేపటలిస్టులు, అంతర్జాతీయ కార్పొరేట్లు పెత్తనాన్ని అంతమొందిస్తాం. వారి నిజస్వరూపాన్ని, అబద్ధాల వెనుక వాస్తవాలను బహిర్గతం చేస్తాం' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. టర్కీలోని ఏకేపీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. పేదరికం, అవినీతి నిర్మూలన అంటూ అధికారంలోకి వచ్చి అనైతిక పరిపాలన సాగిస్తోందని విమర్శించింది. అసమానత్వం రాజ్యమేలుతుంటే నైతికత గురించి మాట్లాడే ధైర్యం ఎక్కడిది? అని ప్రశ్నించింది. పెట్టుబడిదారీవర్గం కార్మికశక్తిని దోచేస్తోందని, పేదలు మరింత పేదలవుతుంటే.. ఆకలి కేకలు మిన్నంటున్నాయని ఆవేదన వ్యక్తంచేసింది. ఇటువంటి పరిస్థితులకు దారితీస్తున్న వారు అనైతికులని, 1923 తరహాలో వారిని బుద్ధిచెబుదామంటూ టర్కీ ప్రజలకు టీకేపీ పిలుపునిచ్చింది.

విశాలాంధ్ర ప్రపంచం

మూడో ప్రపంచ యుద్ధం జరగదు

రష్యాపై ఉక్రెయిన్ విజయం తథ్యం
గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కార్యక్రమంలో జెలెన్‌స్కీ

కీవ్: 'ఇది 2023 సంవత్సరం. ఉక్రెయిన్‌లో యుద్ధం ఇంకా ముగియలేదుగానీ పరిస్థితుల్లో మార్పు వస్తోంది. గెలుపు ఎవరిదో తెలుస్తోంది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ అన్నారు. మూడవ ప్రపంచ యుద్ధం జరగబోదని ఆయన తేల్చిచెప్పారు. మొదటి ప్రపంచ యుద్ధంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. రెండవ ప్రపంచ యుద్ధం అంతకుమించి ప్రాణనష్టాన్ని మిగిల్చింది. ఇప్పుడు మూడవ ప్రపంచ యుద్ధం జరగదు. ఇదేమీ ట్రిలాజి (త్రివిధతర్కము) కాదు' అని జెలెన్‌స్కీ అన్నారు. హాలీవుడ్‌కు సంబంధించి ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కార్యక్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వర్చువల్‌గా ప్రసంగించారు. స్వేచ్ఛా ప్రపంచం సాయంతో తమ భూభాగాన్ని రష్యా వశం కానివ్వబోమని, రష్యాను ఉక్రెయిన్ నిలువరిస్తుందని ఆయన విశ్వాసంగా చెప్పారు. గోల్డెన్ గ్లోబ్ అవార్డులు ప్రారంభైన సమయం ప్రత్యేకమైనదిగా వర్ణించారు. అప్పట్లో రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు దశకు చేరుకొనగా గెలుపు ఎవరిదో తెలిసిందిగానీ ఆ తర్వాత కూడా పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. 1943లో అద్భుత ప్రదర్శకులను సన్మానించేందుకు గోల్డెన్ గ్లోబ్ అవార్డులు తెరపైకొచ్చాయని జెలెన్‌స్కీ అన్నారు. ఉక్రెయిన్ స్వాతంత్ర్యానికి మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, జీవిక హక్కు, ప్రేమించే హక్కు కోసం ఐక్యంగా పోరాడుతున్నామని చెప్పారు. ఉక్రెయిన్ విజయం తథ్యమని జెలెన్‌స్కీ ప్రకటించగా ప్రేక్షకులంతా హర్షధ్వనులతో అభినందించారు. 'మనమంతా కలిసికట్టుగా ఉక్రెయిన్ విజయాన్ని నిజం చేస్తాం... ఆ రోజు మీరంతా మా వెంటే ఉంటారని భావిస్తున్నా. ఉక్రెయిన్ విజయం సాధించే రోజు 'స్లావా ఉక్రెయిని' అంటూ తన ప్రసంగాన్ని జెలెన్‌స్కీ ముగించారు. అయితే అమెరికా-నాటో నుంచి 3.75 బిలియన్ డాలర్ల సైనిక సాయాన్ని ఉక్రెయిన్ అందుకున్న వారం తర్వాత గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల కార్యక్రమంలో జెలెన్‌స్కీ పాల్గొనడం అందరి దృష్టిని ఆకర్షించింది.

ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రభుత్వ ఉద్యోగులకు ఎట్టకేలకు కరువు భత్యంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నుంచి స్పష్టమైన హామీ లభించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఒక డీఏ చెల్లిస్తామని, జనవరి నెలాఖరులోపే మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కొంత ఆలస్యమైనప్పటికీ ప్రతి సంవత్సరం సంప్రదాయంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు ముఖ్యమంత్రి నుంచి ఎన్జీవో అసోసియేషన్ నేతలకు బుధవారం అనుమతి లభించింది. దీంతో ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రెటరి జనరల్ జి.హృదయ రాజు అధ్వర్యంలో సభ్య సంఘాల నేతలు సీఎంను కలిశారు. ఇదే అదునుగా తొలుత ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌తో పాటు సభ్య సంఘాలకు చెందిన నూతన డైరీ, క్యాలెండర్‌లను సీఎంచే ఆవిష్కరణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారు. అనంతరం రాష్ట్రంలో ఉన్న 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఉమ్మడి డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, సీపీఎస్ ఉద్యోగుల డీఏ, మ్యాచింగ్ గ్రాంట్ చెల్లింపులు చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతం, పెన్షన్లు మంజూరు చేయాలని, 12వ పీఆర్సీపై కమిషన్ వేయాలని, 11వ పీఆర్సీ అసమానతలు తొలగించుటకు అనామలిస్ కమిటీ వేయాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, గిరిజన, మోడల్ స్కూల్, మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీ టీచర్లకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, పంచాయతీరాజ్, అగ్రికల్చరల్ శాఖ డిమాండ్లు, ఉద్యోగులకు ఫేస్ యాప్ సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తదితర సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఒక డీఏ ప్రకటిస్తామని, బకాయిపడ్డ ఏపీజీఎల్ఐ, పీఎఫ్, డీఏ లోన్స్, క్లైయిమ్స్‌లో కొంతమేర జనవరి ఆఖరులోపు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

అలాగే 60 నుంచి 62 సంవత్సరాలు పదవీ విరమణ పెంచిన ప్రభుత్వ విద్యాసంస్థల ఉపాధ్యాయులకు త్వరలోనే ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రెటరీ జనరల్ జి.హృదయ రాజు, కో చైర్మన్లు హెచ్.తిమ్మన్న, కె.ఎస్.ఎస్.ప్రసాద్, సీతారామరాజు, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ కె.వి.శివారెడ్డి, వైస్ చైర్మన్‌లు బండి శ్రీనివాస్, శోభన్ బాబు, వేణు మాధవ్, జాని బాషా, పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, స్వామిదాస్, కోశాధికారి రంగారావు, కార్యవర్గ సభ్యులు రమణ, వివిధ సభ్య సంఘాల నాయకులు ఉన్నారు.

మంత్రి అంబటిపై కేసు

(మొదటిపేజీ తరువాయి)

గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేయకపోవడంతో తొలుత జనసేన నేతలు సత్తెనపల్లి కోర్టుకు ఫిర్యాదు చేశారు. ప్రైజ్ చిట్స్, మనీ సర్క్యులేషన్ బ్యానింగ్ చట్ట పరిధిలోని కేసుల విచారణ అధికారం తమకు లేదని అక్కడి కోర్టు పిటిషన్ స్వీకరణకు నిరాకరించింది. దీంతో ఆ చట్ట పరిధిలోని కేసులను విచారించే గుంటూరు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎ.అనిత ఎదుట గుంటూరు ఉమ్మడి జిల్లాల జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పిటిషన్ దాఖలు చేశారు. సంక్రాంతి లక్కీ డ్రాలో బంగారు నక్లెస్లు, ట్రాక్టర్, ఎల్ఈడీ టీవీ, బైక్ తదితర అనేక ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని, ఒక్కొక్క టికెట్టు రూ.100 చొప్పున అమ్ముతున్నారని వెంకటేశ్వరరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక మంత్రి నిషేధిత లాటరీలు ఎలా నిర్వహిస్తారని ఆరోపించారు. పిటిషన్ విచారణకు చేపట్టిన న్యాయమూర్తి అనిత తక్షణమే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఫిబ్రవరి 21వ తేదీకి కేసు విచారణను వాయిదా వేశారు.

ప్రైవేట్ దందా

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకుని నిర్వాహకులు టికెట్ ధరను భారీగా పెంచేస్తుంటారు. దూరప్రాంతాల్లో ఉంటున్న వారిలో చాలామంది కొవిడ్ కారణంగా గత రెండేళ్ల సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లలేకపోయారు. ప్రస్తుతం కరోనా తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనడంతో ఈ ఏడాది పండక్కి తమ గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం టికెట్ బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ తెరిస్తే ధరలు చూస్తే గుండెలుమంటోంది. పది రోజుల కిందటితో పోల్చితే ట్రావెల్స్ నిర్వాహకులు 50 నుంచి వంద శాతం వరకూ రేటు పెంచేశారు. దీంతో సంక్రాంతి ప్రయాణాలు చాలామందికి మోయలేని భారంగా తయారయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతికి హైదరాబాద్, తిరుపతి, చెన్నై, బెంగళూరు, విజయవాడ నుంచి విశాఖ నగరానికి వచ్చేవారితోపాటు నగరం నుంచి విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, నెల్లూరు, హైదరాబాద్ వెళ్లేవారు ఎక్కువగా ఉంటారు. దీన్ని ముందుగానే గుర్తించిన ట్రావెల్స్ ఆపరేటర్లు పండక్కి ముందు, తరువాత హైదరాబాద్, విజయవాడ నుంచి విశాఖకు, విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్‌లకు వెళ్లే బస్సుల్లో టికెట్ చార్జీలను భారీగా పెంచేశారు. సాధారణ రోజుల్లో విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లేందుకు ఏసీ స్లీపర్ రూ.800, నాన్ ఏసీ స్లీపర్ రూ.700, ఏసీ చైర్ రూ.553 ఉండగా, ఈనెల 16,17 తేదీల్లో ఏసీ స్లీపర్ రూ.1,390 నుంచి రూ.1,600 చేశారు. హైదరాబాద్ వెళ్లేందుకు ప్రస్తుతం విశాఖ నుంచి

ఏసీ స్లీపర్ రూ.1,200 నుంచి రూ.1,700, నాన్ ఏసీ రూ.1,060-1,500 ఉండగా, వీటి ధరలను 16, 17 తేదీల్లో ఏసీ స్లీపర్ రూ.3,200 నుంచి రూ.3,800కి పెంచేశారు. నాన్ ఏసీ స్లీపర్ రూ.2,300-రూ.2,800కి చేశారు. తిరుగు ప్రయాణాలు ఉండటంతో 16, 17 తేదీల్లో చార్జీలు పెంచడం చూస్తుంటే ప్రైవేట్ ట్రావెల్స్ దందా బయటపడుతుంది. విశాఖ నుంచి ప్రతిరోజు విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు 54 ట్రావెల్స్ సంస్థలకు చెందిన 70 బస్సులు వెళు తుంటాయి. పండుగ సీజన్‌లో వీటి సంఖ్య మరింత పెరుగుతుంది. ఈ సంక్రాంతి సీజన్‌లో నగరం నుంచి ప్రతిరోజూ మూడు వేల మంది రావడం, వెళ్లడం జరుగుతుందని ఓ అంచనా. టికెట్ పెంపు భారం పడుతున్నా, సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆనవాయితీ కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై రవాణా శాఖ అధికారులు దృష్టిసారించి, ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ 200 సర్వీసులు

సుదూర ప్రాంతాల నుంచి విశాఖ చేరుకున్న ప్రయాణికులకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మరోపక్క విశాఖ రీజియన్ బుధవారం 50 స్పెషల్ సర్వీసులను నడిపింది. విశాఖ-హైదరాబాద్ మధ్య రోజూ 16 షెడ్యూల్స్ ఉన్నప్పటికీ వాటిల్లో సీట్లు అయిపోయాయి. ఇంకా ప్రయాణికుల డిమాండ్ ఉండటంతో హైదరాబాద్‌కు పది ప్రత్యేక సర్వీసులు నడిపారు. అలాగే విశాఖపట్నం-విజయవాడ మధ్య ప్రతి గంటకు ఒక షెడ్యూల్ సర్వీసు ఉన్నప్పటికీ రిజర్వేషన్ పూర్తయింది. ఇంకా డిమాండ్ ఉండటంతో ఆరు ప్రత్యేక సర్వీసులు నడిపింది. అదేవిధంగా అమలాపురం రెండు, కాకినాడ, రాజమండ్రికి ఒక్కో ప్రత్యేక సర్వీసును నడిపింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందినవారు ఎక్కువగా విశాఖ, పరిసర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరంతా సంక్రాంతికి తమ స్వస్థలాలకు వెళ్లేందుకుగాను ప్రతి పదిహేను నిమిషాలకు ఒక షెడ్యూల్ సర్వీస్ ఉన్నప్పటికీ అంతకుమించి ప్రయాణికుల డిమాండ్ ఉండటంతో శ్రీకాకుళం జిల్లాకు పది, విజయనగరం జిల్లాకు పది ప్రత్యేక సర్వీసులు నడిపారు. బుధవారం నుంచి మరింతగా ప్రయాణికుల రద్దీ పెరగడంతో అందుకు తగ్గట్టుగానే బస్సులు సిద్ధం చేసుకున్నామని రీజనల్ మేనేజర్ అప్పలరాజు 'విశాలాంధ్ర'కు తెలిపారు. సాలూరు, పార్వతీపురం, పాలకొండ, రాజాం, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం ప్రాంతాలకు మరిన్ని సర్వీసులు వేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

మావోయిస్టు 'హిడ్మా' కాల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. హిడ్మాపై రూ.45 లక్షల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్‌ను మావోయిస్టు కేంద్ర కమిటీ ధ్రువీకరించలేదు. కేంద్ర కమిటీ సభ్యుడిగా హిడ్మా ఉన్నందున ఆయనకు నాలుగంచెల భద్రత ఉంటుంది. దండకారణ్యంలో జరిగే ప్రతి దాడి వెనుక హిడ్మా హస్తం ఉంటుందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా పూవర్తిలోని ఆదివాసీ కుటుంబంలో జన్మించిన హిడ్మాకు బస్తర్, సుక్మా, దంతేవాడ, బీజాపూర్ ప్రాంతాల్లో మంచి పట్టుంది. దండకారణ్యంలోని ఆదివాసీలతో సత్సంబంధాలు ఉన్నాయి. హిడ్మా(38)కు మావోయిస్టుల్లో మాస్టర్‌మైండ్‌గా గుర్తింపు ఉంది. 17ఏళ్ల వయస్సులోనే అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరి మిలిటెంట్‌గా, బస్తర్ కమాండర్‌గా ఎదిగిన హిడ్మా... పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)లో కీలక నాయకుడయ్యాడు. ఈ దళంలో 180 నుంచి 250 మంది ఉన్నట్లు తెలుస్తోంది. హిడ్మా ఫిలిప్పీన్స్‌లో శిక్షణ పొందినట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ చత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ కమాండర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం దండకారణ్యం ప్రత్యేకజోన్ కమిటీ సభ్యుడిగా, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. చదివింది ఏడో తరగతే అయినాగానీ ఆంగ్లం, గిరిజన మాండలికాలతో సహా అనేక భాషలలో నిష్ణాతుడు. 21 మంది సభ్యులు ఉన్న మావోయిస్టు కేంద్ర కమిటీలో అతిపిన్న వయస్కుడు కూడా ఈయనే. సంతోశ్ అనే మారుపేరు కూడా హిడ్మాకున్నది. హిడ్మా 2010లో జరిగిన తాడిమెట్ల మెరుపు దాడి సూత్రధారి. ఈ దాడిలో 24 మంది జవాన్లు మృతి చెందారు. 2013లో జీరామ్ ఘాటి వద్ద కాంగ్రెస్ నేతల ఊచకోతలోనూ హిడ్మా కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. 2017 ఏప్రిల్‌లో సుక్మా జిల్లాలో 27 మంది సీఆర్పీఎఫ్ జవాన్లపై దాడి భద్రత దళాలకు భారీ ఎదురుదెబ్బగా మిగిలింది. 2021 ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా తరెంలో హిడ్మా వ్యూహంలో చిక్కుకున్న 22మంది బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మృతి చెందారు. ఇలాంటి కనీసం 26 దాడుల్లో హిడ్మా కీలకంగా వ్యవహరించినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు.

ఫిబ్రవరి 22న మహాధర్నా

(మొదటిపేజీ తరువాయి)

పొంతన కనిపించడం లేదన్నారు. మొదట్లో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని చెప్పి...ఇవాళ లబ్ధిదారులే వాటిని కట్టుకోవాలంటూ మాటమారుస్తోందని, జగనన్న ఇంటి నిర్మాణానికి ఇస్తున్న లక్షా 80 వేలు ఎలా సరిపోతాయని రామకృష్ణ ప్రశ్నించారు. సిమెంట్, ఇసుక ధరలు విపరీతంగా పెరిగిపోయినందున అర్హులందరికీ ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇచ్చి... ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిన ఇళ్లు ఐదు మాత్రమేనని పార్లమెంట్‌లో చర్చకు వచ్చిన విషయాన్ని రామకృష్ణ గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా రాష్ట్రం పరువుపోయినా జగన్‌కు సిగ్గురాలేదన్నారు. టిడ్కో ఇళ్లు నాలుగేళ్లుగా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో 'నేనున్నా' అని జగన్ ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు మాట తప్పి...పేదలను అప్పుల పాల్జేశారని మండిపడ్డారు. పైగా ఇళ్లు నిర్మించుకోకుంటే వాటిని రద్దు చేస్తామంటూ వలంటీర్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇళ్ల సమస్యలపై ఈనెల 17 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి, సంతకాల సేకరణ చేపడతామని వివరించారు. 30న లబ్ధిదారులతో కలిసి స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే...ఫిబ్రవరి 6న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేపట్టి, వినతులు ఇస్తామన్నారు. అంతిమంగా ఫిబ్రవరి 22న విజయవాడలో రాష్ట్రస్థాయి మహాధర్నా చేపడతామని ప్రకటించారు. దీనికి పేదలంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేంత వరకూ తమ పోరాటం కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఈ ఉద్యమ కార్యాచరణకు అన్నిచోట్లా ప్రభుత్వం తమకు అనుమతివ్వాలని కోరారు.

అదనపు డీజీపీకి సంబంధం ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం జారీజేసిన జీవో-1కీ, అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్‌కు సంబంధం ఏమిటని రామకృష్ణ ప్రశ్నించారు. జీవోపై అయ్యన్నార్ ఏదేదో మాట్లాడాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ర్యాలీలు, సభలు జరపాలంటే 34 బిరా మీటరు ఉండాలని అయ్యన్నార్ చెప్పారనీ, ఆ వివరాలేమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. జీవో జారీ చేసిన హోమ్‌శాఖ కార్యదర్శిగానీ లేదా డీజీపీగానీ ఏమి చేస్తున్నారన్నారు. జీవో-1లో అరుదైన పరిస్థితి అనేకంటే...అధికార పార్టీ కోసం అని రాసుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఇప్పటికే వ్యవస్థ దిగజారిపోయిందని విమర్శించారు. ప్రతిపక్షాలకు మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వకుండా జీవో తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలని చూస్తున్నారన్నారు. పండుగ చేసుకోవాలన్నా అనుమతులు తీసుకోవాలా అని నిలదీశారు. ఈ జీవోను రాష్ట్రవ్యాప్తంగా భోగి మంటల్లో దహనం చేసి...నిరసనకు దిగుతామన్నారు. అన్ని పార్టీలు ఈ నిరసనలో పాల్గొనాలని రామకృష్ణ కోరారు.

తెలుగు సినీ సత్తా విశ్వవ్యాప్తం

ఆర్ఆర్ఆర్ బృందానికి గవర్నర్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఉత్తమ పాటగా ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించిన ఆర్ఆర్ఆర్ చిత్రబృందానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందనలు తెలిపారు. 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందాన్ని, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని అభినందించారు. ఆ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ప్రపంచ స్థాయికి చేరిందన్నారు. సాహిత్యం, సంగీతానికి తగ్గట్టు నృత్యరీతులను అభినయించిన నందమూరి తారకరామారావు, కొణిదెల రామ్‌చరణ్‌కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. అమెరికా, లాస్ ఏంజిల్స్‌లో బుధవారం జరిగిన 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కార్యక్రమంలో ఈ చిత్ర బృందం అవార్డును అందుకోగా, భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో అవార్డులను తెలుగు సినీపరిశ్రమ గెలుచుకోవాలని గవర్నర్ హరిచందన్ ఆకాంక్షించారు.

తెలుగు జెండా పైకి ఎగిరి రెపరెపలాడుతోంది: సీఎం జగన్

ఆర్ఆర్ఆర్ బృందానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. 'తెలుగు జెండా పైకి ఎగిరి రెపరెపలాడుతోంది. యావత్ రాష్ట్రం తరపున కీరవాణి, రాజమౌళి, తారక్, రాంచరణ్, మొత్తం ఆర్ఆర్ఆర్ బృందానికి అభినందనలు తెలియజేస్తున్నా. మిమ్మల్ని చూసి మేం గర్వపడుతున్నామ'ని జగన్ ట్వీట్ చేశారు.

తెలుగు సినీరంగానికి గర్వకారణం : మాజీ సీఎం చంద్రబాబు

'నాటు - నాటు' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు రావడం తెలుగు సినిమాకు గర్వకారణమని, ఇందుకు కారణమైన ఆర్ఆర్ఆర్ బృంద సభ్యులందరికీ అభినందనలు అని మాజీ సీఎం చంద్రబాబు అన్నారు.

తెలుగు సినీ సత్తా విశ్వవ్యాప్తం : మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస

'తెలుగు సినీ నిపుణుల సత్తాను విశ్వ వేదికపై చాటి, తెలుగువారంతా గర్వపడేలా చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల, సినిమాటోగ్రఫీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆర్ఆర్ఆర్ చిత్రబృందానికి అభినందనలు తెలిపారు.

గోల్డెన్ గ్లోబ్ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

రచించగా ప్రేమ్ రక్షిత్ నృత్య దర్శకుడిగా పనిచేశారు. ఎన్టీఆర్-రామ్‌చరణ్ ప్రధాన పాత్రల్లో రాజమౌళి తెరకెక్కించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. కొమురం భీమ్, అల్లూరి సీతారామరాజులను ఉద్దేశిస్తూ కల్పిత కథగా ఇది రూపుదిద్దుకుంది. యాక్షన్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా గతేడాది మార్చిలో విడుదలై ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు దక్కించుకుంది. ముఖ్యంగా ఈ సినిమాలోని 'నాటు నాటు' పాటకు అంతటా మంచి ఆదరణ లభించింది. విదేశీయులను సైతం ఈ పాట ఉర్రూతలూగించింది. ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కడంపై ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు సహా రాజకీయ, సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు. తెలుగు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన రాజమౌళిని ప్రత్యేకంగా అభినందించారు.

నా శ్రమను, మద్దతిచ్చినవారిని నమ్ముకున్నా: కీరవాణి

అవార్డు తీసుకున్న అనంతరం కీరవాణి మాట్లాడుతూ 'గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందించిన హెచ్ఎఫ్‌పీఏకు ధన్యవాదాలు. సంతోష సమయాన్ని నా సతీమణితో పంచుకోవడం సంతోషం. నా సోదరుడు రాజమౌళికి ఈ అవార్డు దక్కాలి. పాటలో భాగస్వామ్యమైన రాహుల్ సిప్లిగంజ్‌కు ధన్యవాదాలు. నా శ్రమను, నాకు మద్దతు ఇచ్చిన వారిని నమ్ముకున్నాను. ఈ పాట విషయంలో నా కుమారుడు కాలభైరవ అద్భుత సహకారం అందించాడు' అని తెలిపారు.

రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా
26న ట్రాక్టర్ ర్యాలీలు

ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, అందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 26న ట్రాక్టర్లతో ర్యాలీలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశంలో రైతు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. అనంతరం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలిండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ లఖింపూర్ ఖేరిలో శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను కాల్చి చంపటానికి ప్రధాన కుట్రదారుడైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేనీని కేంద్ర క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని, కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. స్వామినాథన్ సిఫార్సుల ఆధారంగా సి2+50 శాతం ఫార్ములాను ఉపయోగించి, అన్ని పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడం వల్ల 80 శాతం మంది రైతులు తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోయి, దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతుల, కౌలు రైతుల పంట రుణాలను ఒక పర్యాయం రద్దు చేసి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా జనవరి 26 తేదీన ట్రాక్టర్ల ర్యాలీతో నిరసనలు నిర్వహించాలని, ఇందులో పార్టీలకు అతీతంగా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చి హామీలను తుంగలో తొక్కిందని, రైతు సంఘాల నాయకులతో చర్చించకుండానే విద్యుత్ బిల్లును పార్లమెంటులో పెట్టడం దుర్మార్గం అని అన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సవరణ బిల్లు 2022ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. 55 సంవత్సరాల పైబడిన రైతులకు నెలకు రూ.10 వేలు చొప్పున పింఛను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దుర్భిక్షం, వరదలు, అతివృష్టి, పంట తెగుళ్ల వల్ల దెబ్బతిన్న అన్ని పంటలకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోశాధికారి వై.కేశవరావు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ మోటర్లకు మీటర్లు బిగించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమం సందర్భంగా అమరులైన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ కృష్ణా నీటి యాజమాన్యం బోర్డును కృష్ణానది పరీవాహక ప్రాంతమైన విజయవాడ, కర్నూలులో ఎక్కడైనా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రభాకరరెడ్డి, రైతు కూలీ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, ఎం.యల్లమందారావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర రెడ్డి, నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డా.కొల్లా రాజమోహన్, అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్, అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీ సంఘం అధ్యక్షులు ఎం.గిరీష్, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ చుండూరు రంగారావు, అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటరెడ్డి, జాగృతి రైతు సంఘం అధ్యక్షులు మరీదు ప్రసాద్, ఆఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రసాద్, రైతు సంఘాల నాయకులు పి.వి.ఆంజనేయులు, ఎ.కాటమయ్య, జోన్న శివశంకర్, డాక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన గరికపాటి రాజారావు స్మారకార్థం 2023 క్యాలెండర్‌ను తీసుకొచ్చారు. విజయవాడ హనుమాన్‌పేట దాసరిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజానాట్యమండలి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కళలు ప్రజా చైతన్యానికీ, మానసిక వికాసానికి, సామాజికాభివృద్ధికి ప్రజానాట్యమండలి దోహదమవుతోందని అన్నారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నూతన కళారూపాలను తయారు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ముందుండి పనిచేయాల్సి ఉంటుందన్నారు. నూతన సంవత్సర క్యాలెండరు తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రజానాట్యమండలి నిర్మాణ బాధ్యులు జంగాల అజయ్ కుమార్, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్ష-కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, ఆఫీసు బేరర్లు ఆర్.పిచ్చయ్య, ఎస్కే నజీర్, ఆరేటి రామారావు, వి.నాగరాజు, ఎ.శివయ్య, పి.చంద్రశేఖర్, విజయవాడ నగర ప్రజానాట్యమండలి నిర్మాణ బాధ్యులు లంకా దుర్గారావు, నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలయ్యే వరకు పోరు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్రాన్ని విడగొట్టిన సందర్భంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం ఏపీకి అన్యాయం చేస్తోందని, విభజన హామీల అమలుతోపాటు ప్రత్యేక హోదా సాధించేంత వరకు అలుపెరుగని పోరాటాలు చేద్దామని రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి, యువజన, వామపక్ష, అఖిల పక్ష నాయకులు ప్రతినపూనారు. విభజన హామీల సాధన కోసం ఈనెల 20న హిందూపురంలో పెద్దఎత్తున ప్రారంభించి, 4న ఇచ్ఛాపురంలో ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ అందులో భాగంగా స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో యువజన, విద్యార్థి, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్వర్యంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. లెనిన్ బాబు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. పదేళ్లుగా మోసం చేస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశామని, ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు అయ్యే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేద్దామని, ఢిల్లీలోని పెద్దలు అదిరేలా ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. దీన్లో భాగంగా ఈనెల 20న హిందూపురంలో బస్సు యాత్ర ప్రారంభించి 26 జిల్లా మీదుగా పయనించి ఫిబ్రవరి 4న ఇచ్ఛాపురంలో జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై ఇటు అధికార, ప్రతిపక్ష పార్టీలు పోరాడకుండా మోదీ చెంతన చేరడం సిగ్గుచేటన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు, రైతు సంఘం నాయకులు చాపర వెంకటరమణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు జి. నర్సునాయుడు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వై. మురళీ, ఏఐటీయుసీ నాయకులు చిక్కాల గోవిందరావు, సీపీఎం నాయకులు జి. సింహాచలం, పీడీఎస్‌యు నాయకులు వినోద్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు చెంగల్రావు, ఏపీఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకులు సూర్యం, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గిరిజా శంకర్, సంతోష్, పలు విద్యార్థి, యువజన, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలిత, ఉపాధ్యక్షురాలు జే హెల్డా ఫ్లోరెన్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీ శ్రీలతను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి నెల వర్కర్స్‌కు వేతనాలతో పాటు సెంటర్లకు సంబంధించిన బిల్స్ ఇవ్వాలని, అంగన్‌వాడీ వర్కర్స్‌కు ముఖ అటెండెన్స్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. పెండింగ్, ఈవెంట్, డైట్ బిల్లులు, విద్యుత్ చార్జీలు అన్ని చెల్లించాలని, పదవీ విరమణ చేసిన వారికి తక్షణమే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ టీచర్లందరినీ ప్రధాన కార్మికులుగా గుర్తించాలని కోరారు. మొబైల్ యాప్‌లలో వెంటనే సవరణలు చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ట్రాకర్ ఒకే పనిని రెండు యాప్‌లలో చేయడానికి సమయం సరిపోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ బిల్లులు బకాయిలు లేకుండా ప్రతినెల చెల్లించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రాష్ట్రవ్యాప్త సమస్యలు పరిష్కారం కోసం సమీక్షా సమావేశం నిర్వహించాలన్నారు. 2018 నుంచి ఇప్పటిదాకా టీఏ, డీఏలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో సమావేశాలు నిర్వహించడం నిలిపివేయాలన్నారు. విధులలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ఇంటికొకరికి అంగన్‌వాడీ వర్కర్, అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగం ఇవ్వాలని, అంగన్‌వాడీ హెల్పర్లకు వర్కర్ల ప్రమోషన్ రాజకీయ జోక్యం లేకుండా సీనియారిటీ ప్రాతిపదికన కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకపోతే ఫిబ్రవరిలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన జేడీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసమే మోదీ ధ్యేయం

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి: ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ధ్యేయమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. తిరుపతిలో బుధవారం ఆయన ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డైరీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహ రించుకోవాలని, విద్యుత్ కేంద్రం నిర్వహణను ఏపీ జెన్కో చేపట్టాలని గత 355 రోజులగా కార్మికులు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పైగా విద్యుత్ కేంద్రం నష్టాల్లో ఉందంటూ ప్రైవేట్ పరం చేయడానికి పూనుకోవడం దారుణం అన్నారు. విద్యుత్ కేంద్రం నిర్వహణను 25ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ఏపీ జెన్కో అధ్వర్యంలో కాలుష్యరహిత విద్యుత్ ప్రాజెక్టు ను నెల్లూరు జిల్లా నేలటూరులో శ్రీ దామోదరం సంజీవయ్య పేరుతో రూ.21 వేల కోట్లతో నిర్మిస్తే దానిని ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం కోసం కుట్ర జరుగుతోందని ఓబులేసు మండిపడ్డారు. దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కి అవసరమైన నాణ్యమైన బొగ్గును సరఫరా చేయకుండా, పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయకుండా ఉద్దేశపూర్వకంగా నష్టాల్లోకి నెట్టేలా ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. 2400 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్లాంటు నిర్వహణను 25 సంవత్సరాలు లీజుకు అదాని కంపెనీకి ఇస్తే రాష్ట్రానికి విద్యుత్ సంక్షోభం తప్పదని హెచ్చరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన ఎనిమిదేళ్లలో ప్రజలు సంపాదించిన ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టడం లేదా తాకట్టు పెట్టడం జరుగుతోందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లు వెనుక కార్పొరేట్ శక్తులు ఉన్నాయని, టెలికాం రంగం తరహాలోనే విద్యుత్ రంగాన్ని కైవసం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని, విద్యుత్తు ఉద్యోగులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్తు బిల్లులో కేంద్రం చేర్చిన 'యాజ్ ప్రిస్క్రైబ్డ్'అనే పదం పర్యవసనాలు దారుణంగా ఉంటాయని, ఈ పదం చేర్చడం ద్వారా ఎప్పుడు ఎలా కావాలంటే అలా చట్టాలను మార్చుకునే వీలుంటుందని ఓబులేసు వివరించారు. ఈ పదంతో ఉద్యోగులపై వేటు వేసే అవకాశం ఉన్నందున రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు పుదుచ్చేరి, మహారాష్ట్ర తరహా లో ఉద్యమం చేయాలనీ ఓబులేసు పిలుపునిచ్చారు. ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు. బి రామలింగారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో వచ్చే విద్యుత్ సంక్షోభానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జెన్కో అధ్వర్యంలోనే నిర్వహించాలని హితవు పలికారు. రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య మాట్లాడుతూ... నాణ్యమైన బొగ్గును రాష్ట్ర లో ఉన్న అన్ని జెన్కో ప్లాంట్లకు ఉత్పత్తికి సరిపడా సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండలరావు, డిస్కం గౌరవ అధ్యక్షుడు యల్ నాగసుబ్బారెడ్డి, సాక శ్రీనివాసశేఖర్, కె.బ్రహ్మానందరెడ్డి, గురుబ్రహ్మం, ఏసోబు, జయమణి కళ్యాణ్, తిరుపతి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కుమార్ రెడ్డి చక్రవర్తి, గంగాధర్, పి.సురేష్ బాబు, పి.శివప్రసాద్‌రెడ్డి, జె.మునికృష్ణ, సుమంత్ ఎన్.చిరంజీవి. ఎన్ దాము తదితరులు పాల్గొన్నారు.

జీవోనం.1 రద్దు చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు: చట్టబద్ధత లేని జీఓనం.1ని రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు కట్టబెట్టిన అఖండ మెజారిటీతో ప్రజారజకంగా పాలన అందించాల్సిన సీఎం జగన్... అందుకు విరుద్ధంగా ప్రజావ్యతిరేకతను రోజురోజుకు మూటకట్టుకుంటున్నారన్నారు. దళితుల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించారన్నారు. అసమానతల సమాజంలో బడుగు బలహీన వర్గాలకు రక్షణగా ఉండాల్సిన ప్రభుత్వం వారిమీదే దాడులకు పోలీసులను ఉపయోగించటం చాలా దారుణమన్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఒక పక్క ర్యాలీలు, విజయోత్సవాలు, ప్రారంభోత్సవాలను రోడ్లపైనే గుంపులుగా చేరి చేస్తుండగా, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, దళిత సంఘాలు చేపట్టే నిరసనలకు మాత్రం జీఓ పేరు చెప్పి అడ్డుకోవటం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా జీవో నం.1ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి, వెనుకబాటుపై అఖిలపక్షం

తక్షణమే నిర్వహించాలని కోరుతూ సీఎం జగన్‌కు కొణతాల లేఖ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర అభివృద్ధి, వివిధ సమస్యలపై ప్రజాసంఘాలు, వివిధ రాజకీయపక్షాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. "నీళ్లు-నిధులు-నియామకాలు' విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్యాయాలు, వివక్షత ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్రకు జరగడం బాధాకరమన్నారు. ఉత్తరాంధ్రలో మొత్తం 30 లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా, అందులో కేవలం 8 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని అధికారిక లెక్కలే చెబుతున్నాయన్నారు. అత్యధిక వర్షపాతం 1050-1200 మి.మీ ఈ ప్రాంతంలో కురుస్తున్నా ఉత్తరాంధ్ర జిల్లాలోని కోటి మంది ప్రజలు తాగునీరు, సాగునీరు సమస్యలతో అల్లాడిపోతూ, పొట్టచేత పట్టుకుని లక్షలాది మంది వలసబాట పడుతున్నారని, ఈ సమస్యలు తీరాలంటే ఏకైక మార్గం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడమేనన్నారు. విశాఖ డివిజన్‌తో కూడిన రైల్వేజోన్ ఏర్పాటుతో పాటు, విశాఖ రైల్వే స్టేషన్‌కు అనుబంధంగా ఎన్ఏడీ జంక్షన్, బీహెచ్‌పీవీ మధ్య శాటిలైట్ రైల్వేస్టేషన్‌లు కోరుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకొచ్చి సాధించాలని కోరుతున్నామన్నారు. జిల్లా కేంద్రాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రారంభించి, ముఖ్యంగా క్యాన్సర్, కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకోవాలని, మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. పై సమస్యలన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజాసంఘాలతో, వివిధ రాజకీయపక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ముఖ ఆధారిత హాజరు మినహాయించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ ఆధారిత హాజరు నుంచి ఆర్టీసీ-పీటీడీ ఉద్యోగులను మినహాయించాలని ఆర్టీసీ-పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీరావు, పలిశెట్టి దామోదరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్టీసీలోని అన్ని ప్రధాన కార్యాలయాలతోపాటు యూనిట్లలో పనిచేసే ఉద్యోగులందరికీ ముఖ ఆధారిత గుర్తింపు హాజరు వేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వాస్తవ పరిస్థితులను యాజమాన్యం గమనించి, పీటీడీ ఉద్యోగులకు మినహాయించాలని కోరారు. పీటీడీ ఉద్యోగులు నిత్యం విధుల్లో ఉంటారనీ, చాలామంది వద్ద స్మార్ట్ ఫోన్లు లేవని వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులు రోజుకు 8 గంటల విధులే అయినప్పటికీ, అంతకంటే అధికంగా పనిచేసే పరిస్థితులున్నాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని వారికి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉద్యమాల అణచివేతకే చీకటి జీవో

- రద్దు చేసే వరకు పోరాటం ఆగదు
- 14న భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని, దీనికి భయపడిన ముఖ్యమంత్రి జీవో నంబర్-1 పేరు మీద బ్రిటీషు కాలం నాటి జీవోను బయటకు తీశాడని అఖిలపక్ష పార్టీ నాయకులు విమర్శించారు. బుధవారం ఉదయం స్థానిక ఆనం రోటరీ హాలులో ప్రజాస్వామిక హక్కులను కాలరాసేందుకు తెచ్చిన జీవో నంబర్-1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముందుగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వక్తలందరిని సమావేశానికి పరిచయం చేస్తూ స్వాగత ఉపన్యాసం చేశారు. ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్ర్యం కావాలని పోరాటం చేశారని, ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం 1861 చట్టం తీసుకువచ్చిందని, నేడు సీఎం జగన్... హిట్లర్ ముసోలిని వారసత్వంగా తీసుకుని చీకటి జీవో తీసుకువచ్చారని విమర్శించారు. ఈ జీవోను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని కోరారు మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆనాడు ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ఒకటి జైలులో, రెండు రోడ్లమీద ఉన్నారని అన్నారు. కనబడిన ప్రతి ఒక్కరికి ముద్దులు పెడుతూ పాదయాత్ర చేశాడని, ఆనాటి ముఖ్యమంత్రి ఈ చీకటి జీవో తీసుకువస్తే జగన్ రోడ్డు మీద ఉండేవాడా అని ప్రశ్నించారు. జనసేన రాష్ట్ర పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యవహార శైలి నియంతృత్వంగా ఉందని, ఇప్పటి వరకు ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు నుంచి గానీ, ప్రజల నుంచి గానీ ఒక్క వినతిపత్రం స్వీకరించలేదని తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రారంభించే బస్సు యాత్ర, లోకేశ్ పాదయాత్ర, సీపీఐ నేత రామకృష్ణ పోరాటాలకు భయపడి ఈ నల్ల జీవో తెచ్చారని అన్నారు. రాజమండ్రి శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు నాటి జీవోను తీసుకొచ్చి ప్రజలను, ప్రజాస్వామిక వాదులను ప్రభుత్వం భయపెట్టాలని చూస్తుందని విమర్శించారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని అన్నారు. ఈ విధానాలపై బీజేపీ నోరు విప్పాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను వైసీపీ ప్రభుత్వం నీరుగార్చిందని, బహిరంగ సభలోనే కాకుండా హాలులో జరుగుతున్న సమావేశాలకు కూడా అనుమతి కావాలనడం అన్యాయమని అన్నారు. పేపర్ మిల్లు కార్మికులకు అఖిలపక్షం సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు అత్తిలి రాజు, వై.శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జేపీ రామారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు కె.జోజి రమణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కిరణ్, కె.సూరిబాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మణి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ జ్యోతి రాజు, సీపీఎం నగర కార్యదర్శి పవన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సునీల్, మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు సేపేని రమణమ్మ, ఎడ్ల లక్ష్మి, జట్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల(టారిఫ్)పై ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 19 నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో సభ్యులు ఠాకూర్ రాంసింగ్, పి.రాజగోపాల్ రెడ్డి పాల్గొంటారన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన వార్షిక ఆదాయ అవసర నివేదికలు విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయాలను సేకరించనున్నారు. ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం

26 నుంచి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ప్రజల్లో నెలకొన్న నిరాశ నిస్పృహలను దూరం చేసి వారికి భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ జనవరి 26 నుండి ప్రజాక్షేత్రంలో అడుగు పెడుతున్నట్లు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు డీసీసీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతమ్ రెడ్డి, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇందిరా భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ సంస్థాగత అభివృద్ధి కోసం జిల్లా పర్యటనలను చేపట్టినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్యాయాలు, అక్రమాలు పెరిగాయని, సామాన్యులకు రక్షణ కరువైందని అన్నారు. కేబినెట్ మంత్రులకు కూడా గౌరవం లేదని, సర్పంచులకు నిధులు విధులు లేకుండా పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని తెలిపారు. ఇక బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మైనారిటీలు అభద్రతాభావంతో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జనగణన చేయాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రథమ శత్రువు జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. సీఎం జగన్‌కు రాష్ట్ర అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విభజనచట్టం హామీలపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇతర పార్టీల నేతలు మాతో టచ్‌లో ఉన్నారని, అవసరం వస్తే కాంగ్రెస్ పార్టీ లోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే పాదయాత్రకు అనుమతి కావాలని డీజీపీకి విజ్ఞాపన అందజేస్తామన్నారు. జీవో నెంబర్ ఒకటి సాకు చూపి అడ్డుకుంటే ఏం చేయాలో తర్వాత ఆలోచిస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మునియప్పన్, పీసీసీ మీడియా చైర్మన్ తులసీరెడ్డి, పీసీసీ నాయకులు గౌతమ్‌రెడ్డి, కమలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపాదకీయం

కులగణన ప్రాధాన్యత

బిహార్‌లో కులగణన ప్రారంభం అయింది. కులగణన జరగాలని మొట్ట మొదట కోరింది బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్. చివరకు ఆయనే కులగణనకు శ్రీకారం చుట్టారు. కులగణన ప్రతిపాదనను శాసనసభలో బీజేపీ కూడా సమర్థించింది కనక ఆ పార్టీ సైతం నితీశ్ ప్రయత్నాన్ని ఎదిరించే స్థితిలో లేదు. ఎన్నికల దృష్టితో చూస్తే కులగణనవల్ల నితీశ్ కుమార్ కు కలిగే పెద్ద ప్రయోజనం ఏమీ లేదు. ఎందుకంటే ఆయన ప్రాతినిధ్యం వహించే సామాజిక వర్గం కేవలం రెండు శాతం మాత్రమే. గత కొద్ది సంవత్సరాలుగా కులగణన జరగాలన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. దీనికోసం ఒత్తిడి క్రమంగా పెరుగుతూనే ఉంది. మండల్ రాజకీయాల మీద ఆధారపడే వారు ప్రధానంగా కులగణన కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇతర వెనుకబడిన కులాల వారు, గిరిజనులు, దళితులు బీజేపీకి మద్దతు ఇవ్వడం ప్రారంభమైన తరవాత కులగణన కోసం అడిగే వారు పెరిగిపోయారు. ఏ కులం వారు ఎంత మంది ఉన్నారో తేలితే సామాజిక న్యాయం అందజేయడం మరింత సులభం అవుతుందని కులగణన కోరే వర్గాలు వాదిస్తున్నాయి. దీనివల్ల అభివృద్ధి లక్ష్యాలు మరింత విస్తృతం అవుతాయన్న ఆలోచన వీరికి ఉంది. కులాల వారీ లెక్కలు తేలితే వివిధ రంగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వారు తమ పాత్రను మరింత సమర్థంగా నిర్వహించగలుగుతారన్న అభిప్రాయం ఉంది. ఆర్థిక, రాజకీయ రంగాలలో వివిధ కులాల వారు మరింత చురుకుగా, విస్తృతంగా పాల్గొనే అవకాశం ఉంటుందన్న వాదనా ఉంది. అయితే కులగణన కావాలంటున్న వారి వాదనలో పైకి కనిపించే లక్ష్యానికి మించిన లక్ష్యం ఉందని అనే వారికీ కొదవ లేదు. మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన తరవాత ఇతర వెనుకబడిన తరగతుల వారిలో రాజకీయ చైతన్యం పెరిగిన మాట వాస్తవం. ఇతర వెనుకబడిన తరగతుల వారు ఉత్తర భారతంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగడం చూస్తూనే ఉన్నాం. 1990 ల నుంచి ఇతర వెనుకబడిన కులాల వారు తమ హక్కులకోసం, వనరుల్లో తగిన వాటా కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఉత్తేజితులై రాజకీయ చైతన్యం పెంపొందించుకున్న వర్గాలు రాజకీయాల్లో కేంద్ర స్థానం లోకి రావడం ఒక రకంగా బీజేపీ అనుసరించే కమండల రాజకీయాలకు పెద్ద సవాలుగా తయారైంది. బాబరీ వివాదం, దాని పర్యవసానంగా ఆ చారిత్రక కట్టడం మన బహుళ సంస్కృతికి తీవ్ర విఘాతం కలిగించి ఉండవచ్చు కానీ కమండల రాజకీయాలు బీజేపీకి అధికారం దక్కేట్టు చేశాయి. ఇది సామాజిక న్యాయం కోసం పోరాడే పక్షాలను చైతన్యవంతులను చేసింది. కమండల రాజకీయాలను ఎదుర్కునే శక్తి మండల్ రాజకీయాలు అనుసరించే వారికే ఉంటుందని రుజువైంది. సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్‌లోని భిన్న పక్షాలు మండల్ రాజకీయాల నేపథ్యంలో అవతరించి బలపడ్డేవే. ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్ లాంటి వారు ఆ క్రమంలోనే బలమైన రాజకీయ నాయకులుగా ఎదిగారు. మండల రాజకీయాలు హిందుత్వ రాజకీయాలను నిలవరించడానికి ఉపకరించిన మాట వాస్తవమే కానీ ఈ క్రమంలోనే కాంగ్రెస్, వామపక్ష పార్టీల కాళ్ల కింది నేల జారిపోయిన మాట కూడా వాస్తవమే. ఈ ప్రభావం ప్రధానంగా బిహార్, ఉత్తరప్రదేశ్‌లో ప్రస్ఫుటంగా కనిపించింది.

మరో వేపున నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ హిందుత్వ రాజకీయాలకు ఒక వేపున పదును పెడ్తూనే ఇతర వెనుకబడిన కులాల వారిని, దళితులను సమీకరించడానికి కొత్త ఎత్తులు ఎత్తుతూనే ఉంది. మండల్ రాజకీయాలు నడిపిన ములాయం సింగ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ, లాలూప్రసాద్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్.జె.డి.) యాదవులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాయని బీజేపీ ప్రచారం చేయడం మండల్ రాజకీయాలు అనుసరించే రాజకీయ పక్షాలకు విఘాతం కలిగించింది. మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ వల్ల కూడా దళితుల్లో జాతవులకే ఎక్కువ ప్రయోజనం కలిగిందన్న వాదనా ఉంది. ఈ సహస్రాబ్ది ఆరంభం నుంచి నితీశ్ కుమార్ యాదవేతర ఇతర వెనుకబడిన వర్గాలను సమీకరించడంలో సఫలమయ్యారు. దళితులను కూడా ఆయన చేరదీయగలిగారు. బిహార్ లో ఒక దశలో లాలూ ప్రాభవం తగ్గడానికి నితీశ్ కుమార్ అనుసరించిన ఈ పంథానే కారణం. ఇంకో వేపు బీజేపీ తన పలుకుబడి విస్తరించుకోవడానికి కుల సమీకరణలకు ప్రాధాన్యం ఇచ్చింది. అదే సమయంలో అవసరమైనప్పుడల్లా హిందుత్వ రాజకీయాలను మరింతగా ఆశ్రయించింది. ప్రస్తుతం నితీశ్ కుమార్ లాలూ నాయకత్వంలోని ఆర్.జె.డి.తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉండొచ్చు. దీనికి విభిన్నమైన కారణాలు ఉన్నాయి. రాజకీయాలలో ఏ పంథా శాశ్వతం కాదని బీజేపీతో తెగతెంపులు చేసుకుని నితీశ్ నిరూపించారు.

నితీశ్ కుమార్ కులగణనకు ప్రాధాన్యం ఇవ్వడానికి, ఈ లెక్కలు సేకరించడానికి భారీగా నిధులు కేటాయించడానికి కారణం మండల్ రాజకీయాలు అనుసరించే వారు ఒకే కులానికి ప్రాముఖ్యత ఇచ్చే వారు కాదని నిరూపించడానికే. కులాల లెక్క తేలితే మరిన్ని కులాలను తమ పరిధిలోకి తీసుకొచ్చి సామాజిక న్యాయం కోసం మరింతగా పాటుబడే అవకాశం ఉంటుందన్నది నితీశ్ కుమార్ అంచనా కావచ్చు. వీలైనన్ని కులాలను సమీకరిస్తే తప్ప బీజేపీని ఎదిరించడం సాధ్యం కాదన్న అభిప్రాయం నితీశ్‌కుమార్‌కు ఉన్నట్టుంది. బీజేపీ ఓట్ల కోసం వివిధ కులాల మద్దతు సంపాదించడానికి పాట్లు పడుతూ ఉండొచ్చు. కానీ సామాజిక న్యాయాన్ని బీజేపీ పట్టించుకున్న సందర్భాలు తక్కువ. ఆ అంశం ఆధారంగానే కులగణన ద్వారా మరింత పకడ్బందీ రాజకీయ వ్యూహాలు పన్నాలన్నది నితీశ్ అంచనా అయి ఉంటుంది. నితీశ్ కుమార్ దృష్టి ప్రధానంగా సామాజిక న్యాయం మీదే ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒకే కుల బలం మీద ఆధారపడ్డ చిన్న చిన్న రాజకీయ పార్టీలు ఉత్తరాదిలో కులగణన అవసరాన్ని ముందుగా నొక్కి చెప్పాయి. ఇతర వెనుకబడిన కులాల వారిలో సంఖ్యాబలం, ఆధిపత్యం ఉన్న కులాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే పార్టీలను నిలవరించడానికి ఈ చిన్న పార్టీలు కులగణన కోసం ఒత్తిడి చేశాయి. ఇతర వెనుకబడిన కులాల వారిలోనూ రాజకీయ ఆధిపత్యం చెలాయించగలిగిన స్థితిలో ఉన్న వర్గాలకే ఎక్కువ ప్రయోజనం కలిగిన మాట వాస్తవం. సంక్షేమ పథకాల ప్రయోజనం ఆధిపత్యం చెలాయించే సామాజిక వర్గాలకే దక్కింది. రిజర్వేషన్ల వల్ల ఎక్కువ ప్రయోజనం పొందింది కూడా ఈ సామాజిక వర్గాలే. ఒక కులానికే ప్రాతినిధ్యం వహించే పార్టీలు రాజకీయాలలో, రిజర్వేషన్లలో వాటా కోసం కులగణన కావాలనుకుంటున్నాయి. వీరి ఆకాంక్షలకు నితీశ్ బలమైన వాణిగా నిలిచారు. ఎవరి జనాభా ఎంతో ఆ దామాషా ప్రకారమే తగిన వాటా దక్కాలన్న కాన్షీరాం మాట నెరవేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

లింగవివక్ష మంటల్లో మహిళలు

దేశ సుస్థిరాభివృద్ధికి మహిళలు, బాలికల సాధికారతతో పాటు లింగ సమానత్వం దోహదపడుతుంది. మహిళా సాధికారత, లింగ సమానత్వ సాధన ప్రాధాన్యాలను గుర్తించిన ఐరాస ప్రపంచ దేశాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో యస్‌డిజి-5 అంశంగా “లింగ సమానత్వం ని తీసుకొని విశ్లేషిస్తున్నది. కేంద్ర గణాంక ప్రణాళిక అమలు మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన తాజా నివేదికలో భారత మహిళలు, పురుషుల ఆరోగ్య గణాంకాలు, విద్య, ఆర్థిక వ్యవస్థల్లో భాగస్వామ్యం, నిర్ణయాధికారాల్లో భాగస్వామ్యం, సాధికారత సాధనలో ఆటంకాలు అనే ఆరు ప్రధాన అంశాల పై లోతైన అధ్యయనాలు జరిగాయి.

2021లో ఇండియాలో జనాభా 136.3 కోట్లు ఉండగా అందులో 48.6 శాతం మహిళలు ఉన్నారు. 2011లో జనాభా పెరుగుదల రేటు 1.63, 2016లో 1.28, 2021లో 1.08 ఉన్నట్లు అధ్యయనం తెలిపింది. జనాభాలో ప్రతి 1000 మంది పురుషులకు స్త్రీల సంఖ్యను లింగ నిష్పత్తిగా తీసుకుంటారు. 2001లో ప్రతి 1000 మంది పురుషులకు 933 మంది మహిళలు ఉండగా (1000 : 933) 2011 నాటికి 1000 : 943కు పెరగడం, 2021 నాటికి 1000 : 945కు చేరవచ్చని తెలుస్తున్నది. ఆరేళ్లలోపు పిల్లల్లో లింగ నిష్పత్తి 1000 బాలురు : 918 బాలికలు ఉండడం తీవ్ర హెచ్చరికగా భావించాలి. పురుషుల కన్న మహిళల ఆయుర్దాయం అధికంగా ఉంటోంది. దేశంలోని 35 రాష్ట్రాలు/యూటీల్లో 20ల్లో 60 ఏండ్ల జనాభాలో స్త్రీలు అధికంగా ఉండడం గమనించారు. కేరళ, మణిపూర్, పుదుచ్చేరి, తమిళనాడుల్లో మహిళల నిష్పత్తి 1000 దాటి ఉన్నారని, 9 రాష్ట్రాలు/యూటీల్లో స్త్రీల నిష్పత్తి 900 కన్న తక్కువగా ఉండడం తీవ్ర సమస్యగా భావించాలి. 2017-19లో గ్రామీణ ప్రాంతాల్లో లింగ నిష్పత్తి 904 మహిళలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 906 ఉన్నది. 2021లో గ్రామీణ ప్రాంత నిష్పత్తి 958 మహిళలు ఉండగా, పట్టణాల్లో 930 మహిళలు ఉన్నట్లు తేలింది.

భారతమహిళల్లో పోషకాహారలోపంతో రక్తహీనత, శరీర బల హీనతలు అధికంగాకనిపిస్తున్నాయి. బాల్యవివాహాలు, పోషకాహారలేమి, అనారోగ్యాలు, ప్రసవసమయంలో వైద్య వసతులలేమి లాంటి సమస్యల చట్రంలో మహిళాలోకం కొట్టుమిట్టాడుతున్నది. 2014-18లో సగటు ఆయుర్దాయం పురుషులకు 68.2 ఏండ్లు ఉండగా, స్త్రీలకు 70.7 ఏండ్లు ఉన్నది. 2016లో జనన రేటు 20.4 ఉండగా, 2019లో 19.7గా నమోదైనది. గ్రామీణంలో జనన రేటు 2016 నుంచి 2019 వరకు 22.1 నుంచి 17.0 వరకు తగ్గడం గమనించగా పట్టణాల్లో 21.4 నుంచి 16.4కు పడిపోయినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో మాతృ సంబంధ ప్రసూతి మరణాల నిష్పత్తి 2016-18లో 113 ఉండగా 2017-19లో 103కి చేరింది. అస్సాం, బిహార్, చత్తీస్‌ఘడ్, యంపీ, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, యూపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మాతృ ప్రసూతి మరణాల నిష్పత్తి జాతీయ సగటు కన్న అధికంగా ఉంది. 2018లో సగటు మహిళల వివాహ వయస్సు 21.9 ఉండగా 2019లో 22.1కు చేరింది. తల్లుల ప్రసవానంతర వైద్య ఆరోగ్య సౌకర్యాలు 2015-16లో 62.4శాతం ఉండగా 2019-21లో 78.0శాతానికి పెరగడం హర్షదాయకమే. నాగాలాండ్‌లో కనిష్టంగా 43.9 శాతం, గోవాలో అత్యధికంగా 93.3 శాతం తల్లులు ప్రసవానంతర వైద్య సదుపాయాలను పొందుతున్నారు. ఆసుపత్రి ప్రసవ గణాంకల్లో 2015-16లో 78.9శాతం, 2019-21లో 88.6 శాతానికి పెరగడం సంతోషదాయం. అండమాన్‌నికోబార్, గోవా, కేరళ, లక్ష్యద్వీప్, పుదుచ్చెరి, తమిళనాడుల్లో 100శాతం ఆసుపత్రి ప్రసవాలు జరుగుతుండగా నాగాలాండ్‌లో 45.7శాతం, మేఘాలయాలో 58.1 శాతం గమనించారు. 2015-16 నుంచి 2019-21 వరకు మహిళల్లో (15-49 ఏండ్లు) రక్తహీనత 53.1 శాతం నుంచి 57.0 శాతానికి పెరిగింది. పొగాకు వినియోగ దారులు 2016-17 నుంచి 2019-21 వరకు 42.4 శాతం నుంచి 38.0 శాతానికి తగ్గడం గమనించారు. పురుషుల్లో స్థూలకాయం 18.9 శాతం నుంచి 22.9 శాతానికి పెరగ్గా మహిళల్లో 20.6 శాతం నుంచి 24.0 శాతానికి పెరిగినట్టు నివేదిక తెలిపింది.

-డెస్క్

జోషిమఠ్ విపత్తు తీవ్ర హెచ్చరిక

టి.వి.సుబ్బయ్య

హిమాలయ సానువుల్లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని జోషిమఠ్ పట్టణం ఇటీవల కాలంలో ఎరుగని విపత్తుకు గురైంది. పట్టణమంతా కుంగిపోవచ్చునని అంచనా వేశారు. ఇందుకు ప్రధాన కారణం ఆయా ప్రభుత్వం రూపొందించిన ప్రకృతి విధ్వంసక ‘అభివృద్ధి’ విధానాలేనని చెప్పవచ్చు. దాదాపు 25 వేలు జనాభా గల చిన్న పట్టణం జోషిమఠ్. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ జీవించవలసిన ప్రజలు ఇప్పుడు ప్రకృతి విపత్తుల మధ్య జీవించవలసి వస్తోంది. ఈ పట్టణంలో రోడ్లు చీలికలు, ఇళ్లు బీటలు వారి ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తక్షణం దాదాపు 700ఇళ్లను, హోటల్స్ తదితరభవనాలను కూల్చి వేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ముందుగా ఒరిగిపోయి నివాస గృహాలపై పడి మరింతప్రమాదం సృష్టించడానికి కారణం కావచ్చునని నిర్ధారించిన రెండు హోటళ్లను కూల్చివేసేందుకు మంగళవారం ప్రయత్నించిన అధికారులు ప్రజల ఆందోళనతో ఆగిపోయారు. పట్టణంలోని అత్యధిక ప్రాంతాలు అంటే మూడొంతులు రోడ్లచీలికలు, భవనాల పగుళ్లకు దారి తీసింది. అందువల్ల పట్టణమంతా కూల్చివేసి మరోచోట పట్టణం నిర్మించ వలసిందేనని జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్.సి.ఎం.సి) మంగళవారం తెలియజేసింది. తక్షణం విపత్తు ప్రభావానికి గురైన అన్ని ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలను తక్షణం ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ముందుగా నష్ట పరిహారం చెల్లించి సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అప్పుడే ఇళ్లు ఖాళీ చేస్తామని ప్రజలు అంటున్నారు. ఇప్పటికిప్పుడు నూతన పట్టణం నిర్మాణం కష్టమే అయినా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించిన సూచనలు లేవు.

దాదాపు 50ఏళ్ల నాడు 1976 లోనే ఎంసి మిశ్రా కమిషన్ ఈ ప్రాంతంలో పెద్ద భవనాలను, భారీ ప్రాజెక్టులను నిర్మించవద్దని, పర్యావరణ సున్నిత ప్రాంతమైనందున విపత్తులు సంభవించే అవకాశం ఉందని తన నివేదికలో తెలియజేస్తూ హెచ్చరించినప్పటికీ అప్పుడుగానీ, తర్వాత పాలించిన ప్రభుత్వాలు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటి విపత్తుకు ప్రధాన కారణాల్లో ఇదొకటి అవుతుందని నిపుణులు విశ్లేషించారు. భారీ కట్టడాలు వద్దన్న మిశ్రా కమిషన్ చెప్పినప్పటికీ అక్కడ కొండలను తవ్వి చార్‌ధామ్‌కు రహదారులును భారీ విద్యుత్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. 66 సొరంగాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 18 సొరంగాల నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. తక్కినవి ముగింపు దశలో ఉన్నాయి. హిమాలయ ప్రాంతాల్లో ప్రపంచంలో ఎక్కడా లేని

విధంగా జనాభా సాంద్రత ఎక్కువని అధ్యయనాలు తెలియజేశాయి. మన ప్రభుత్వాలు ఏ అధ్యయనాలను పట్టించుకోవనేది రుజువైన వాస్తవం. నివేదికను బుట్ట దాఖలు చేయడానికే ప్రాధాన్యత. నివేదికల కోసం వందలు, వేల కోట్లు ప్రజల కష్టార్జితాన్ని వృథా చేస్తారు. ఈ విపత్తు పైన అధ్యయన బాధ్యతను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ కేంద్రం (డెహ్రాడూన్) జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాదు) కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. నిష్పాక్షిక నివేదికలను ప్రజలు ఆశించినా అలాగే ఉంటుందని ఆశించలేము.

సొరంగాల తవ్వకాన్ని, భారీ విద్యుత్ ప్రాజెక్టులను వెంటనే నిలిపివేసి నిర్మాణం కొనసాగించవద్దని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. గతంలో చార్‌ధామ్ సందర్శకులున్న సమయంలో భారీ కొండచరియలు విరిగిపడటం, అత్యంత భారీవర్షాలు వరదల కారణంగా కనీవిని ఎరుగని విధ్వంసం జరిగింది. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా కొండలను తొలిచి భారీ రహదారులు, భవనాలు నిర్మించరాదని పర్యావరణ వేత్తలు కోరారు. వీటిని నిర్మించడానికి బదులుగా ఆరోగ్యం, విద్య, బిజినెస్ (హైదరాబాదు) ప్రభుత్వ విధాన రూపకల్పన సంస్థ రిసెర్చి డైరెక్టరు అంజల్ ప్రకాశ్ సూచించారు. ఈ విపత్తుకు ప్రధానంగా భవిష్యత్ పరిస్థితులను ఆలోచించకుండా కొండల్లో భారీ కట్టడాలు నిర్మించడం తగదని పర్యావరణ శాస్త్రవేత్తలు చేసిన హెచ్చరికలను ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. చార్‌ధామ్ ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేయాలని పర్యావరణవేత్తలు సుప్రీంకోర్టుకు వెళ్లగా కోర్టు ఉన్నతస్థాయి కమిటీని వేసింది. నివేదిక రాకుండానే రెండు భారీ విద్యుత్ ప్రాజెక్టులను ప్రభుత్వం ఆమోదించడం దేనికి సంకేతం? కోర్టుల సూచనలు సైతం లెక్కచేయని తెంపరితనం నేటి ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్నాయి. 190 మిల్లీమీటర్ల వర్షపాతం, ప్రమాద స్థాయిలో వరదలు అనేక సార్లు గత దశాబ్దికాలంలో సంభవించాయి. మూడేళ్ల క్రితం కేదార్‌నాథ్ యాత్ర సమయంలో సంభవించిన అతి భారీ వర్షాలు, వరదల కారణంగా దాదాపు నాలుగు వేల మందికి పైగా మరణించారు. పర్వత ప్రాంతాల్లో తవ్వకాలు, కట్టడాలు, చెట్లను నరికివేయడం ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతాయని ఐక్యరాజ్య సమితి వాతావరణ పరిశోధన విభాగం హెచ్చరిస్తూనే ఉంది. తాజావిపత్తు తర్వాతకూడా శబ్దాలురాని పేలుడువస్తువులను ఉపయోగించి తవ్వకాలుజరుపుతున్నారంటే కార్పొరేట్ల అత్యాశకు అంతులేదని పిస్తోంది. మూడేళ్ల క్రితం భారీగా మరణాలు సంభవించాక కూడా ఏడు భారీ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతించి తప్పుడు లెక్కలు వెల్లడించినట్లు తెలుస్తోంది. గర్వాల్ ప్రాంతంలో గత దశాబ్ద కాలంలో అనేకసార్లు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆర్థిక, ప్రాణ నష్టాలు జరిగాయి. ప్రపంచ వాతావరణ విపత్తులను ఎదుర్కొనే సూచీలో భారతదేశం 5వ స్థానంలో ఉంది. మన ప్రభుత్వం వద్ద ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం ఉండదు. అంతర్జాతీయ అధ్యయనాల మీదే ఆధారపడవలసి వస్తోందని పర్యావరణవేత్తలు విమర్శిస్తున్నారు. 2022 లో ఈ ప్రాంతాన్ని దాదాపు 5 కోట్ల మంది యాత్రికులు సందర్శించారు. వీరివల్ల అనేక కోట్లు ఆదాయం ఉంటుంది. ఇదే వాణిజ్యవేత్తలకు ముఖ్యం.

విపత్తులను మన ప్రభుత్వాలు పట్టించుకోవు. చార్‌ధామ్ నుండి బద్రీనాథ్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టాక కొండ చరియలు విరిగిపడి నష్టాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుత విపత్తుకు కారణం ఎన్‌టిపిసి నిర్మిస్తున్న తపోవన్ జల విద్యుత్ ప్రాజెక్టు, సొరంగాలు, తెగిపోతున్న జలాశయాలు, డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం కారణంగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక విచ్చలవిడిగా చెట్లు నరికివేసి ఆ ప్రాంతాలను ఆక్రమించుకొని రకరకాల నిర్మాణాలు చేపడుతున్న వారు పర్యావరణ విపత్తులను పట్టించుకోవడం లేదు. ధన సంపాదనను మాత్రమే అభివృద్ధిగా ప్రచారం చేస్తున్న అలాంటి విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలు విపత్తులకు ముఖ్య కారకులు. జోషిమఠ్ పర్యావరణ, సాంస్కృతిక, వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైంది. పట్టణానికి దగ్గరలోనే చైనాకు మనకు మధ్య వాస్తవాధీన రేఖ ఉంది. బద్రినాథ్‌కు, హేమకుండ్ సాహిబ్‌ల ముఖ ద్వారం లాంటిది ఈ పట్టణం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొంటాయా?

దివాలా దిశగా పాకిస్తాన్

ఎం కోటేశ్వరరావు

గోధుమ పిండి ధర కిలో రు.150కి పెరిగింది. వంట గ్యాస్ 11.8 కిలోల బండ ధర రు.2,550. విద్యుత్ ఉత్పత్తి తగినంత లేక దుకాణాలను ముందుగానే మూసివేయాలని ఆదేశిస్తున్న అధికారులు. లీటరు పాల ధర రు.108.71, కిలో బియ్యం రు.245, డజను గుడ్ల ధర రు.240, కోడి మాంసం కిలో రు.548, కిలో ఉల్లి రు.86, బ్రెడ్ రు.108, (నంబియో డాట్‌కామ్) పాకిస్తాన్ నుంచి వస్తున్న వార్తలివి. అక్కడ విద్యుత్ కొరత ఉంది. (మన గుజరాత్‌లో కూడా గత వేసవిలో గంటల కొద్దీ ఇండ్లకు, వారానికి ఒకసారి పరిశ్రమలకు కోత విధించారు) అక్టోబరులో సవరించిన ధరల ప్రకారం 50 యూనిట్లకు రు.2 నుంచి 700 వరకు శ్లాబుల వారీ పెరుగుతూ రు.20.82, అంతకు మించితే ప్రతియూనిట్‌కు రు.23.92, ఇవి గాక ఇతర పన్నులు అదనం. తెలంగాణాలో 50 యూనిట్లకు రు.1.45 నుంచి క్రమంగా పెరుగుతూ 401-800కు రు.9, అంతకు మించితే రు.9.50 వసూలు చేస్తున్నారు. అక్కడి ధరలతో పోల్చుకొని మన దేశంలో ధరలను చూడండి, నరేంద్రమోదీ పాలన జనాలకు మంచి రోజులు తెచ్చిందా లేదా అని భక్తులు రెచ్చిపోతున్నారు, అడ్డు సవాళ్లు విసురుతున్నారు. పాకిస్తాన్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మాట నిజం. అక్కడ పరిస్థితులన్నీ సజావుగా ఉన్నట్లు, జరుగుతున్నదంతా సరైనదే అని ఎవరూ చెప్పటం లేదు. అవసరమూ లేదు. అలాంటి దేశం గురించి ఎక్కువగా చెబుతున్నదీ, పోలుస్తున్నదీ ఎవరంటే బిజెపి నేతలు, మద్దతు దారులే. ఎందుకంటే అంతకంటే మెరుగైన దేశంతో పోల్చు కొనేందుకు ఇష్టపడరు. అక్కడ పెట్రోలు, డీజిలు ధరలు తక్కువఅంటే వెళ్లి అక్కడినుంచి తెచ్చుకోవాలని ఎద్దేవా చేస్తారు.

మనదేశంలో గత నెల రోజులుగా గోధుమల టోకు ధర కిలో రు.28.50గా ఉందని, ఇది కనీస మద్దతు ధర కంటే 40 శాతం ఎక్కువ అని జనవరి ఏడవ తేదీ టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక పేర్కొన్నది. ప్రైస్‌ఇ డాట్‌కామ్ జనవరి ఎనిమిదవ తేదీ సమాచారం ప్రకారం ఆశీర్వాద్ షర్బతీ గోధుమ పిండి ధర అమెజాన్‌లో రు.282 (ఐదు కిలోలు) అదే కంపెనీ సుపీరియర్ ఎంపీ రకం ధర రు.175 (ఐదు కిలోలు), ఆశీర్వాద్ శుద్ధ గోధుమ పిండి రకం ధర రు.95 (రెండు కిలోలు). విడిగా ఎలాంటి బ్రాండ్ లేకుండా దొరికే పిండి ధర కిలో 40కి అటూ ఇటూగా ఉంటున్నది. మన దగ్గర 14.5 కిలోల గ్యాస్ బండ ధర రు.1,105 గా ఉంది. మరి వీటితో పోల్చినపుడు పాకిస్తాన్ కంటే మన దేశంలోనే ధరలు తక్కువగా ఉన్నాయి కదా అని ఎవరికైనా సందేహం కలుగుతుంది. నిజమే కనిపించేదాన్ని కాదని ఎలా అంటాం ? ఎఎన్‌ఐ వార్తా సంస్థ జనవరి ఏడవ తేదీన పేర్కొన్నదాని ప్రకారం పాక్ పంజాబ్‌లో 15కిలోల గోధుమ పిండి సంచి ధర రు.2,250 (కిలో 130 నుంచి 150 వరకు ఉంది), అదే వార్తలో మండ్ గోధుమల ధర రు.5,000కు తాకినట్లు కూడా పేర్కొన్నది. మండ్ అంటే 37 కిలోల 324 గ్రాములకు సమానం. ఈ లెక్కన కిలో గోధుమలకు అక్కడి రైతులు రు. 134 పొందుతున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక పేర్కొన్న ప్రకారం అదే మన రైతులు పొందుతున్నది రు.28.50 మాత్రమే! ఇది ఘోరం అని అనిపించటం లేదూ ! పాక్ రైతులు అంత మొత్తం పొందుతుండగా మన రైతులకు ఎందుకు ఇవ్వటం లేదు ? మన రైతుల్ని పాకిస్తాన్ వెళ్లి అమ్ముకోమంటారా?

ఒక డాలరుకు మన కరెన్సీ రూపాయి విలువ జనవరి ఎనిమిదిన రు.82.27 ఉంది. పాకిస్తానీ రూపాయి విలువ రు.227.25గా ఉంది. మన ఒక రూపాయి 2.76 పాక్ రూపాయలకు సమానం. మన దేశ బహిరంగ మార్కెట్‌నుంచి పాకిస్తాన్ ఒక క్వింటాలు గోధుమలను దిగుమతి చేసుకుంటే వారు చెల్లించాల్సిన మొత్తం రు.7,866 అవుతుంది.(మన బహిరంగ మార్కెట్ ధర కిలోకు రు.28.50, దాన్ని పాక్ కరెన్సీలోకి మారిస్తే రు.78.66, ఆ లెక్కన క్వింటాలు ధర రు.7,866. కానీ పాక్ రైతులకు కిలోకు 134 వంతున 13,400 దక్కుతున్నట్లు ఎఎన్‌ఐ వార్తా సంస్థ పేర్కొన్నది. పాక్‌లో గ్యాస్ కిలో ధర రు.216. మన దేశంలో రు.76.20. గ్యాస్‌ను మనమూ దిగుమతి చేసుకోవాలి, పాకిస్తాన్ కూడా దిగుమతి చేసుకోవాల్సిందే. అందువలన తక్కువగా ఉన్న పాక్ కరెన్సీ విలువను చూపి అక్కడ ఎంతో ఎక్కువగా ఉన్నట్లు చిత్రించటాన్ని ఏమనాలి ? రెండు కరెన్సీల పేర్లూ రూపాయి కావటంతో మభ్య పెట్టేందుకు వీలు కలుగుతోంది.

గ్లోబల్ ప్రైస్ డాట్‌కామ్ ప్రతి దేశంలో ఉన్న స్థానిక కరెన్సీలో ఉన్న పెట్రోలు, డీజిలు ధరలను డాలర్లలోకి మార్చి ధరల తీరు తెన్నులను వారానికి ఒకసారి ప్రచురిస్తుంది. దాని ప్రకారం పెట్రోలు, (బ్రాకెట్లలో డీజిలు) ధరలు డాలర్లలో జనవరి రెండవ తేదీన ఇలా ఉన్నాయి. పాకిస్తాన్ 0.947(1.005),భూటాన్ 0.990(0.947), మయన్మార్ 1.046 (1.156) చైనా 1.178(1.051) బంగ్లాదేశ్ 1.221(1.024) భారత్ 1.260(1.130) నేపాల్ 1.344(1.324) శ్రీలంక 1.396(1.108) ఉంది. ఇప్పటికీ మన దేశంలో పాకిస్తాన్ కంటే చమురు ధరలు ఎక్కువగానే ఉన్నాయి. అమెరికాలో లీటరు పెట్రోలు ధర 0.893, డీజిలు ధర 1.199 డాలర్లుగా ఉంది. ప్రతి దేశం ఎగుమతులు చేస్తుందా లేదా అన్నది ఒక అంశమైతే, దానికి అనేక అంశాలు తోడు కావాలి. సాధారణంగా ఎగుమతులు చేసే దేశాల కరెన్సీ విలువ తక్కువగా ఉంటేనే అది అంతర్జాతీయ మార్కెట్లో తన సరకులను అమ్ముకోగలుగుతుంది అని చెబుతారు. ఇది ఒక అంశం తప్ప అదొక్కటే చాలదు, జపాన్ ఎన్ విలువ ఒక డాలరుకు 132 కాగా చైనా యువాన్ విలువ 6.84 ఉంది. జపాన్ కరెన్సీ విలువ తక్కువగా ఉన్నా, చైనాతో పోలిస్తే వేతనాలు ఎక్కువ గనుక ఉత్పత్తి ఖర్చు ఎక్కువ. అందువలన ఒకే వస్తువును చైనా తక్కువ ధరలకు ఉత్పత్తి చేసి ఎగుమతులు చేస్తున్నది. మన దేశంలో వేతనాలు, కరెన్సీ విలువ తక్కువ ఉన్నప్పటికీ సరైన విధానం, నూతన ఆవిష్కరణలు,సాంకేతిక పరిజ్ఞానం లేక ఎగుమతులు చేయలేని స్థితి.

మన దేశంలో తక్కువ ఆదాయం వచ్చే వారు పెరిగిన ధరలతో ఎలా ఇబ్బందులు పడుతున్నారో పాకిస్తాన్‌లో కూడా మన కంటే ఎక్కువగా ద్రవ్యోల్బణ పెరుగుదల ఉన్నందున అక్కడి పేదలు ఒకింత ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. అందువల్లనే పెట్రోలు, డీజిలు ధరలకు పన్నులు వడ్డిస్తే భారం మరింతగా పెరుగుతుంది కనుక మన మాదిరి పన్నులు లేనందున, దాని కరెన్సీ విలువ ఎంత తగ్గినా మనతో పోలిస్తే తక్కువ ధరలకు పెట్రోలు, డీజిలు అందుబాటులో ఉంటున్నది. విదేశీ చెల్లింపుల సంక్షోభం, రుణ భారంతో శ్రీలంక తీవ్ర పరిస్థితి ఎదుర్కొన్నట్లుగానే పాకిస్తాన్ కూడా అదే బాటలో ఉన్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. దివాలా కోరు విధానాలను అనుసరిస్తే ఏ దేశమైనా అదే విధంగా మారుతుంది. పాకిస్తాన్ నుంచి వెలువడే ప్రముఖ దినపత్రిక “డాన్” డిసెంబరు 18వ తేదీన ప్రచురించిన ఒక (ఇద్దరు ఆర్థిక నిపుణుల) విశ్లేషణలో కొన్ని అంశాలు దిగువ విధంగా ఉన్నాయి. దేశ విభజన నాటి నుంచే పాకిస్తాన్‌కు ఆర్థిక సవాళ్లు ఎదురయ్యాయి. రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. కొన్ని శక్తులు తమ స్వప్రయోజనాల కోసం దేశాన్ని రుణగ్రస్తం గావించాయి. విభజనతో నాడు వలస పాలనలో ఉన్న రాబడిలో 17శాతం పాకిస్తాన్‌కు రాగా మిలిటరీలో 33శాతాన్ని భరించాల్సి వచ్చింది. దీని వలన అనేక ప్రభుత్వాలు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. పాకిస్తాన్ 22సార్లు ఐఎంఎఫ్ రుణాలు తీసుకోగా భారత్ ఏడు, బంగ్లాదేశ్ పదిసార్లు మాత్రమే తీసుకుంది. గడచిన ఏడున్నర దశాబ్దాలలో అనేక సార్లు సంక్షోభాలు దగ్గరకు వచ్చిన అనుభవాలను చూసింది. చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. ప్రతిసారీ మరింత నష్టం జరగకుండా ఐఎంఎఫ్ ఆదుకున్నది. ఆ సాయాన్ని సాంప్రదాయ పద్దతుల్లో ఆర్థిక రంగం స్వల్పకాలిక స్థిరత్వాన్ని సాధించేందుకు ఉపయోగించారు. తరచుగా సంక్షోభాలు రావటం, వాటి ప్రభావాలు పేరుకు పోవటంతో దీర్ఘకాలిక సవాళ్లు అలాగే ఉండి మొత్తం వృద్ధి మీద ప్రభావం చూపుతున్నది.

ప్రారంభంలో పాకిస్తాన్ కంటే భారత్ వెనుకబడి ఉంది, 1980 దశకంలో ఒక దశలో పాక్ ఆర్థికవృద్ధి రేటు భారత్‌ను దాటింది. 1990లో భారత ఆర్థిక సంస్కరణలు నిరంతర వృద్ధి బాటలో దేశాన్ని నిలిపాయి. పాకిస్తాన్ ఆర్థిక పురోగమనంలో దిగజారుడు అలాగే ఉంది. ప్రస్తుతం అస్థిరమైన జిడిపి వృద్ధి రేటు, కరెన్సీ విలువ రికార్డు స్థాయికి పతనం, దానితో పాటు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, విస్తృతం అవుతున్న కరంట్ ఖాతా లోటు ఉంది. ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితం అవుతున్నది. వ్యవస్థాగతమైన ఆర్థిక సమస్యలేమిటో నిర్ధారించకుండా రాజ్యం రెంటియర్ ఆర్థిక వ్యవస్థను తయారు చేసింది. (దీని అర్ధం ఏమంటే కొత్త నిర్మాణాలేమీ లేకుండానే ఉన్న ఇండ్లకు అద్దె వసూలు చేసుకోవటం, బతకటం) సమాజంలో ఆర్థికంగా ఉన్నతులైన వారందరూ అనేక సబ్సిడీలు పొందటంలో నిమగ్నమయ్యారు. దీంతో ఉన్న అప్పులకు తోడు మరింతగా పెరిగాయి. అప్పులు పెరిగినపుడు పెట్టుబడులను ఆకర్షించటం, నవీకరణలు ప్రోత్సహించటం పాకిస్తాన్‌కు పెద్ద సవాలుగా ఉంది. చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి ఒక కారణం నాలుగు దశాబ్దాలుగా వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయటం. 1993-2020 సంవత్సరాలలో పాకిస్తాన్ కేవలం రెండు సార్లు ఆరుశాతం కంటే ఎక్కువగా వృద్ధి రేటును సాధించగా భారత్‌లో పద్దెనిమిది సార్లు ఉంది. ఇదీ డాన్ విశ్లేషణ సారం.

జోషిమఠ్‌లో ఆందోళన

- కూల్చివేతల్ని అడ్డుకున్న స్థానికులు
- తగిన పరిహారం చెల్లించాల్సిందేనని ధర్నా
- ఒప్పించేందుకు పాలనా యంత్రాంగం యత్నాలు
- బాధిత కుటుంబాలకు రూ.1.5 లక్షల పరిహారం : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

జోషిమఠ్ : ప్రకృతి విపత్తు సంభవించిన ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్‌లోని నివాసితులు, వ్యాపారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమ ఇళ్లు, వ్యాపార సముదాయాలు కుంగిపోతుండటంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ క్రమంలో జోషిమఠ్‌లో ప్రమాదకరంగా ఉన్న మౌంట్ వ్యూ, మలారి ఇన్ అనే రెండు ప్రధాన హోటళ్లను కూల్చివేయాలని పరిపాలనా యంత్రాంగం నిర్ణయించింది. ఈ విషయం తెలియగానే పెద్ద సంఖ్యలో ప్రజలు, వ్యాపారులు గుమిగూడి హోటళ్ల వెలుపల నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. అయితే కూల్చివేతలకు అనుమతించని హోటళ్ల యజమానులను, స్థానికులను ఒప్పించేందుకు బుధవారం పరిపాలన యంత్రాంగం కొత్త ప్రయత్నాలు చేసింది. కూల్చివేత కసరత్తు చేపట్టకముందే బద్రీనాథ్ తరహాలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులకు, ముఖ్యమంత్రి కార్యదర్శి మీనాక్షిసుందరం మధ్య తాజా చర్చలు జరిగాయి. 'మలారి ఇన్', 'మౌంట్ వ్యూ' హోటళ్లు ప్రమాదకరంగా ఒకదానికొకటి వంగి నిర్మాణాల చుట్టూ ఉన్న మానవ నివాసాలకు ముప్పు కలిగిస్తున్నాయి. ఉత్తరాఖండ్ ప్రభుత్వం సోమవారం ఈ రెండు భవనాలతో ప్రారంభించి, ప్రమాదకర నిర్మాణాలను ధ్వంసం చేయాలని ఆదేశించింది. ఈ విషయమై ఉన్నతాధికారి ఒకరు విలేకరులతో మాట్లాడుతూ జోషిమఠ్‌లోని రెండు హోటళ్లను మాత్రమే కూల్చివేయాలని, నివాసానికి అనర్హమైన ఇళ్లను గుర్తించవద్దని స్పష్టం చేశారు. 'నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. రెండు హోటళ్లను మాత్రమే కూల్చివేస్తారు. ప్రమాదకర జోన్‌లో ఉన్న ఇళ్లను కూల్చడం జరగదు. రెడ్ క్రాస్ మార్కులు వేయరు. వాటిని ఖాళీ చేయించడం మాత్రమే' అని భూమి క్షీణతకు గురవుతున్న పట్టణానికి చెందిన నోడల్ అధికారి సుందరం చెప్పారు. అయితే, కూల్చివేత కసరత్తు ప్రారంభంపై కచ్చితమైన సమయపాలన ఇవ్వలేదని, నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులతో తన పరస్పర చర్య సానుకూలంగా ఉందని, ఈ విషయం త్వరలో పరిష్కారమవుతుందని ఆయన అన్నారు. ఇదిలాఉండగా, జోషిమఠ్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా ఇప్పటివరకు 723 భవనాలు దెబ్బతిన్నాయని, వాటిలో 86 భవనాలు అసురక్షితమని ప్రకటించారు. పట్టణంలో 20 వేల మంది జనాభా ఉన్నారు. మొత్తం 131 కుటుంబాలకు చెందిన 462 మందిని ఖాళీ చేయించి తాత్కాలిక సహాయక శిబిరాల్లో ఉంచారు. కాగా కూల్చివేతల ప్రక్రియను చేపట్టడానికి మంగళవారం పరిపాలన అదనంగా మూడు కంపెనీల రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాన్ని నియమించింది. 'మలారి ఇన్', 'మౌంట్ వ్యూ' హోటళ్లు ప్రమాదకరంగా వంగి నిర్మాణాల చుట్టూ ఉన్న ఇళ్లకు ముప్పు వాటిల్లడంతో వాటిని తొలగించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే కోపోద్రిక్తులైన ప్రజలు నిర్మాణాలను కూల్చివేసే ముందు తమకు పునరావాసం కల్పించాలని డిమాండు చేస్తూ నినాదాలు చేశారు. జిల్లా మేజిస్ట్రేట్ హిమాన్షు ఖురానా మాట్లాడుతూ 'ప్రజలు, వ్యాపారులను సమన్వయం చేసుకుంటూ, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రజా ప్రయోజనాల కోసం పరిపాలనా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుంది' అని తెలిపారు. కానీ మలారి ఇన్ హోటల్ యజమాని ఠాకూర్ సింగ్ రాణా తన కుటుంబ సభ్యులతో కలిసి హోటల్ బయట ధర్నాకు దిగారు. 'నా హోటల్ వ్యయంలో నాలుగింట ఒక వంతు పరిహారంగా పరిపాలన యంత్రాంగం అందిస్తోంది. అది ఎంతవరకు న్యాయం? హోటల్ వ్యయాన్ని లెక్కించకుండా కూల్చివేయడాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు రూ.1.5 లక్షలు మధ్యంతర సాయాన్ని అందజేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. ఈ మొత్తంలో ఇంటి మార్పిడికి అడ్వాన్స్‌గా రూ.50 వేలు, విపత్తు సహాయానికి రూ.లక్ష అందజేస్తున్నామని, దానిని తర్వాత సర్దుబాటు చేస్తామని తెలిపారు. అద్దె గృహాలకు మారాలనుకునే వారికి ఆరు నెలల పాటు నెలకు రూ.4 వేలు అందజేస్తామని అన్నారు. అంతకుముందు సుందరం సంబంధిత వర్గాలతోనూ, స్థానికులతోనూ సమావేశం నిర్వహించి మార్కెట్ ధరల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. 'ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అందరి సూచనలను తీసుకున్న తర్వాత మార్కెట్ రేటు నిర్ణయించడం జరుగుతుంది. స్థానిక ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటాం' అని చెప్పారు. ఇంతలో, ఆందోళనకు గురైన స్థానికులు ధర్నాకు కూర్చోవడం, కూల్చివేతలకు ముందుకు వెళ్లడానికి అధికారులను అనుమతించకపోవడంతో పరిహారం కోసం నినాదాలు పెరిగాయి. 'మేము బద్రీనాథ్ తరహాలో పరిహారం ఇవ్వాలని కోరుతున్నాం. అది కుదరదని సీఎం కార్యదర్శి చెప్పారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వవచ్చని అన్నారు. కానీ మార్కెట్ రేటు ఎంత అని మేం అడిగితే చెప్పలేదు' అని హోటల్ మలారి ఇన్ యజమాని ఠాకూర్ సింగ్ రాణా తన ధర్నాను పునః ప్రారంభించే ముందు విలేకరులతో అన్నారు. నివాసితుల కష్టాలకు తోడు, జోషిమఠ్‌లో వాతావరణం ప్రతికూలంగా మారింది. పట్టణంలో మేఘావృతమై చినుకులు కురుస్తున్నాయి. వర్షపు నీరు ఆ ప్రాంతంలో భూమి ముంపునకు కారణమవుతుందని ప్రజలు భయపడుతున్నారు.

రైతుల నిరసన హింసాత్మకం

అర్ధరాత్రి నిద్రిస్తున్నవారిపై పోలీసుల దాడి

బక్సర్: బీహార్‌లోని బక్సర్‌లో బుధవారం హింస చెలరేగింది. ఇంట్లో నిద్రిస్తున్న రైతులపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు విరుచుకుపడి విచక్షణరహితంగా కొట్టారంటూ స్థానికులు చేపట్టిన నిరసన హింసకు దారితీసింది. ఆగ్రహావేశాలకు గురైన నిరసనకారులు పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. వాటికి నిప్పుపెట్టారు.

రెండు నెలలుగా...

చౌస పవర్ ప్లాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని విద్యుత్ కంపెనీ సట్లజ్ జల్ విద్యుత్ నిగమ్ (ఎస్‌జేవీఎన్) సేకరించిన భూముల వ్యవహారంపై రెండు నెలలుగా రైతులు కంపెనీ గేటు బయట నిరసనలు సాగిస్తున్నారు. దీంతో ప్లాంట్ పనులకు విఘాతం కలుగుతోంది. ఈ క్రమంలో నిరసనలు సాగిస్తున్న రైతులు ఉంటున్న ఇంటిపై మంగళవారం రాత్రి పోలీసులు విరుచుకుపడ్డారు. వారి కుటుంబసభ్యులపైనా దాడులకు దిగారు. గ్రామంలోని ముగ్గురు యువకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు జరిపిన దాడులకు ప్రతిగా స్థానికులు బక్సర్ రోడ్లపైకి వచ్చి బుధవారం ఆందోళనలకు దిగారు. పోలీసులు, వారి వాహనాలపై రాళ్లు రువ్వారు. దీనిపై రైతు నిరసనకారుడు ఒకరు మీడియాతో మాట్లాడుతూ సరైన పరిహారం ఇవ్వనందునే తాము నిరసనలు చేస్తున్నామని చెప్పాడు. అయితే మంగళవారం రాత్రి పోలీసులు ఒక రైతు ఇంటిపై దాడి చేసి మహిళలని కూడా చూడకుండా కొట్టారని, నలుగురిని అరెస్టు చేశారని, ఎస్‌జేవీఎన్ కంపెనీ కారణంగానే పోలీసులు తమను వేధిస్తునట్టు తెలిపాడు.

విచారణకే ఐదేళ్లు

లఖింపూర్ ఖేరీ హింస కేసుపై సెషన్స్ జడ్జి

న్యూదిల్లీ: కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా నిందితుడిగా ఉన్న లఖింపూర్ ఖేరీ హింస కేసు విచారణ ముగియడానికి ఐదేళ్లు పడుతుందని కేసు విచారణను నిర్వహిస్తున్న సెషన్స్ జడ్జి సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఈ కేసులో 208 మంది ప్రాసిక్యూషన్ సాక్షులు, 171 డాక్యుమెంట్లు, 27 ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నివేదికలు ఉన్నట్టు అత్యున్నత న్యాయస్థానానికి రాసిన లేఖలో సెషన్స్ జడ్జి తెలిపారు. లఖింపూర్ ఖేరీలో 2021 అక్టోబర్‌లో నిరసన తెలుపుతున్న రైతులపై కారునడిపిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆశిష్ మిశ్రా వేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు ఇటీవల తోసిపుచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. దీనిపై న్యాయమూర్తులు సూర్యకాంత్, వి.సుబ్రమణియన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఇతర కేసులు, కోర్టు ప్రాధాన్యతాంశాలను వాయిదా వేయకుండా సాధారణ క్రమంలో కేసు విచారణ పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతుందని గత నెలలో సెషన్స్ కోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనిపై సెషన్స్ కోర్టు ఇచ్చిన వివరణను న్యాయమూర్తులు ప్రస్తావిస్తూ, విచారణ పూర్తి కావడానికి కనీసం ఐదేళ్లు పట్టవచ్చని ఆయన (సెషన్స్ జడ్జి) తెలియజేశారన్నారు. రైతులపై కారు నడిపిన ముగ్గురు వ్యక్తులను ఆందోళనకారులు కొట్టిచంపిన మరో కేసులో నిందితులు నలుగురు ఇప్పటికీ కస్టడీలోనే ఉన్నారా అని కూడా యూపీ ప్రభుత్వం తరపు హాజరైన న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను జనవరి 19వ తేదీకి వాయిదా వేసింది.

కేసు పూర్వాపరాలు

లఖింపూర్ ఖేరీ జిల్లాలో 2021 అక్టోబర్ 3న జరిగిన హింసాత్మక ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఆ ప్రాంతాన్ని సందర్శించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసన ప్రదర్శనకు దిగారు. ఆందోళనకు దిగిన రైతులపై కారు నడపడంతో నలుగురు మృతి చెందారని, కారులో ఆశిష్ మిశ్రా ఉన్నారని ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ ఘటనతో ఆగ్రహం చెందిన రైతులు కారు డ్రైవర్, ఇద్దరు బీజేపీ కార్యకర్తలను కొట్టిచంపారు.

ఈ హింసలో ఒక జర్నలిస్టు కూడా మృతి చెందాడు. గత ఏడాది డిసెంబర్ 6న విచారణ కోర్టు ఆశిష్ మిశ్రా, మరో 12 మందిపై హత్యానేరం, నేరపూరిత కుట్ర కింద అభియోగాలు నమోదు చేసింది. ఆశిష్ మిశ్రాతో సహా మొత్తం 13 మంది నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. వీరంతా ప్రస్తుతం జైలులో ఉన్నారు.

సుప్రీం తీర్పును వ్యతిరేకించిన ఉపరాష్ట్రపతి



న్యూదిల్లీ: భారత రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని పార్లమెంటు మార్చజాలదని, ఈ విషయంలో సుప్రీంకోర్టుకు మాత్రమే అంతిమ అధికారం ఉందని చెప్పడాన్ని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ పూర్తిగా వ్యతిరేకించారు. 1973లో సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసులో ఇచ్చిన తీర్పులో దీనిని చెప్పిందని, దీనిని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానన్నారు. రాజస్థాన్ విధాన సభలో బుధవారం జరిగిన 83వ అఖిల భారత ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో లోక్‌సభ సభాపతి ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. న్యాయమూర్తుల నియామకం, న్యాయ వ్యవస్థ పాత్రపై ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రిసైడింగ్ అధికారుల సమావేశం కూడా ఈ చర్చకు మరోసారి వేదికగా నిలిచింది. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ గతంలో నేషనల్ జ్యుడిషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసినపుడు కూడా తీవ్రంగా మండిపడ్డారు. ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ, 1973లో సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసులో ఇచ్చిన తీర్పు చెడు దృష్టాంతంగా నిలుస్తోందన్నారు. ఈ తీర్పును తాను సమర్థించబోనన్నారు. భారత రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని, ఈ విషయంలో అంతిమ అధికారం సుప్రీంకోర్టుదేనని ఈ తీర్పులో చెప్పారన్నారు. "మౌలిక నిర్మాణం" లేదా "రాజ్యాంగ ప్రాథమిక శిల్పం" అని చెబుతున్న దానిని రాజ్యాంగ సవరణలు ఉల్లంఘించినట్లు ప్రకటిస్తూ, ఆ రాజ్యాంగ సవరణలను రద్దు చేసే అధికారాన్ని మొట్టమొదటిసారి కేశవానంద భారతి తీర్పులోనే సుప్రీంకోర్టు సృష్టించిందని చెప్పారు. ఆ తర్వాతి కాలంలో ఈ మౌలిక నిర్మాణానికి చాలా ముఖ్యమైనవిగా చెబుతూ అనేక ముఖ్యమైన రూలింగ్స్‌ను సుప్రీంకోర్టు ఇచ్చిందన్నారు. ఈ ప్రక్రియలో పార్లమెంటరీ సార్వభౌమాధికారానికి హాని జరిగిందన్నారు. ప్రజా తీర్పుదే పైచేయి అనేది ప్రజాస్వామిక సమాజంలో ఏ మౌలిక నిర్మాణానికైనా మూలమని తెలిపారు. పార్లమెంటు, చట్టసభల ఆధిక్యత, సార్వభౌమాధికారం అనుల్లంఘనీయమైనవన్నారు. అన్ని రాజ్యాంగ వ్యవస్థలు - న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక శాఖ, చట్టసభలు - తమ తమ పరిధులకు లోబడి పని చేయాలని, అత్యున్నత స్థాయి ప్రమాణాలతోకూడిన ఔన్నత్యం, గౌరవ, మర్యాదలకు అనుగుణంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. ఈ అంశంలో ప్రస్తుత పరిస్థితులు సంబంధితులందరూ తీక్షణంగా దృష్టి సారించవలసిన అవసరాన్ని కల్పిస్తున్నాయన్నారు. మరీ ముఖ్యంగా ఈ వ్యవస్థలను నడిపేవారు తీక్షణంగా దృష్టి సారించాలన్నారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు, శాసనం పట్ల వ్యవహరించేందుకు పార్లమెంటుకుగల అధికారం ఏ ఇతర వ్యవస్థకు లోబడినది కాదన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి జీవన రేఖ అని చెప్పారు. దీనిపై అందరూ ఆలోచనాత్మకంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చట్ట సభలు, న్యాయ వ్యవస్థ మధ్య సామరస్యపూర్వక సంబంధాలను నెరపాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రిసైడింగ్ ఆఫీసర్లు చర్చించాలని కోరారు.

యూపీలోనూ భవనాలకు పగుళ్లు

లక్నో: ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్‌లో మాదిరిగా యూపీలోనూ కొన్ని భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. బుధవారం అలీఘడ్‌లోని కన్వరిగంజ్ ప్రాంతంలో కొన్ని ఇళ్లకు అకస్మాత్తుగా పగుళ్లు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఇది జాతీయ విపత్తు కాదని.. స్మార్ట్ సిటీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ లీకేజ్ కావడంతో పగుళ్లు ఏర్పడ్డాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు పగుళ్లు ఏర్పడి భయాందోళనకు గురవుతున్నామని, మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని స్థానికుడు శశి తెలిపారు. ఇళ్లు కూలిపోతాయేమోనని భయపడుతున్నామని స్థానికురాలు అఫ్షా మష్రూర్ తెలిపారు. పగుళ్ల అంశం తన దృష్టికి రాలేదని, సమస్యను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఈ ఘటనపై మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేశ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. జోషీమఠ్‌లో మాదిరిగా మంగళవారం కర్ణప్రయాగ్‌లోని బహుగుణ నగర్‌లోనూ దాదాపు 50 ఇళ్లు బీటలు వారాయని అక్కడి ప్రజలు తెలిపారు. చాలా కుటుంబాలు వెంటనే ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి.

సమైక్య భావాన్ని బీజేపీ దిగజార్చింది

పంజాబ్‌లో కొనసాగుతున్న రాహుల్ యాత్ర

చండీగఢ్ : దేశంలో సమైక్య భావాన్ని బీజేపీ దిగజార్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. భారత్‌జోడో యాత్ర పంజాబ్ లో ప్రారంభం కావడానికి ముందు యాత్ర చేపట్టడానికి గల ప్రేరణపై ఆయన వివరణ ఇచ్చారు. పంజాబ్‌లోని సిర్హింద్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తుల లక్ష్యం దేశాన్ని విభజించడమేనన్నారు. ఇందుకోసం కులాలు, మతాలను చివరికి భాషను కూడా ఆయుధాలుగా ఉపయోగిస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని చెప్పారు. దేశానికి ప్రేమ, ఐక్యత, సౌభ్రాతృత్వంతో కూడిన భిన్నమైన మార్గాన్ని చూపాలని కాంగ్రెస్ భావిస్తోందని, అందుకే ఈ యాత్రను చేపట్టామన్నారు. జోడో యాత్రకు దేశ వ్యాప్తంగా అపూర్వ స్పందన లభించిందని రాహుల్ పేర్కొన్నారు. 'దీనికి ఒక కారణం ఉంది. బీజేపీ ప్రజల మధ్య ద్వేషం, భయం, హింస వ్యాపింపజేస్తోంది. ఇది దేశం వెళ్లాల్సిన మార్గం కాదు .దాని చరిత్ర కూడా కాదు. ఈ దేశం సోదరభావం, ఐక్యత, గౌరవానికి ప్రతీక. అందుకే ఈ యాత్ర విజయవంతమైంది' అని రాహుల్ అన్నారు. పంజాబ్‌లోని ఫతేఘర్ సాహిబ్‌లోని సిర్హింద్ నుంచి రాహుల్ జోడో యాత్రను కొనసాగించారు. మండి గోవింద్‌ఘర్, ఖన్నా, సాహ్నెవాల్, లుధియానా, గోరయా, ఫగ్వారా, జలంధర్, దస్యువా, ముకేరియన్ మీదుగా యాత్ర సాగింది. పాదయాత్ర జమ్ముకశ్మీర్‌లోకి ప్రవేశించడానికి ముందు జనవరి 19న పఠాన్‌కోట్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తారు. కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్ర సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమైంది. జనవరి 30న శ్రీనగర్‌లో ముగుస్తుంది.

చెప్పుల్లేకుండా రాహుల్ పాదయాత్ర

చలిగాలుల్లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కేవలం టీషర్ట్ మాత్రమే ధరించి భారత్ జోడోయాత్ర కొనసాగించడంపై ఇప్పటికే మీడియాలో చర్చనీయాంశం కాగా, తాజాగా బుధవారం పంజాబ్‌లో చెప్పులు కూడా లేకుండా పాదయాత్ర చేస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. రాహుల్‌తో పాటు పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్‌సింగ్ రాజా వారింగ్ కూడా చెప్పులు లేకుండా నడిచారు. ఇవి సిర్హింద్-బస్సీపఠాన్ రోడ్‌లోని ప్రముఖ దర్గాను రాహుల్ సందర్శించిన అనంతరం తీసిన ఫొటోలుగా భావిస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఉష్ణోగ్రత సుమారు 4 డిగ్రీల సెల్సియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఫొటోకు సంబంధించి కాంగ్రెస్ నేతలెవరూ అధికారికంగా స్పందించలేదు. శీతాకాలం కావడంతో పంజాబ్‌లోని బఠిండా సహా వివిధ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రత 2.4 డిగ్రీలుగా నమోదవుతోంది. మధ్యప్రదేశ్‌లో ముగ్గురు చిన్నారులు చిరిగిన దుస్తుల్లో చలికి వణుకుతూ కనిపించారని, అందుకే తాను కేవలం టీషర్ట్ ధరించి పాదయాత్ర చేపడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఆ బాలికల మాదిరిగానే రాహుల్ కూడా చలికి వణుకుతారని సందేశమివ్వాలనుకుంటున్నాని అన్నారు. చలిగాలులు తనను గజగజ వణికించినపుడే స్వెట్టర్ ధరిస్తానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఎన్సీపీ నేత లక్ష్యంగా ఈడీ సోదాలు

న్యూదిల్లీ/ముంబై: ఎన్సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హసన్ ముష్రిఫ్, ఇతరులపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం మహారాష్ట్రలోని వివిధ ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ముష్రిఫ్‌కు సంబంధమున్న రాష్ట్రంలోని కొన్ని చక్కెర కర్మాగారాల కార్యకలాపాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ముంబై, పూనే, కొల్హాపూర్‌లలో ఉన్న వివిధ ప్రాంగణాల్లో ఉదయం 6:30 గంటల నుంచే ఈడీ అధికారులు సోదాలు ప్రారంభించినట్లు సమాచారం. ఎన్సీపీకి చెందిన ముష్రిఫ్ (68) కొల్హాపూర్ జిల్లా కాగల్ అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికయ్యారు. ఎన్సీపీకి ఉపాధ్యక్షుడు కూడా. గ్రామీణాభివృద్ధి మంత్రిగా పనిచేసిన ముష్రిఫ్... తన కుటుంబ సభ్యులు, 'బినామీ' సంస్థల ద్వారా అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని బీజేపీ నాయకుడు కిరీట్ సోమియా 2021లో ఆరోపించారు. అయితే ఎన్సీపీ ఈ ఆరోపణలను ఖండించింది.

అంబానీ స్కూల్‌కు బాంబు బెదిరింపు

ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి చెందిన ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు బాంబు బెదిరింపు కలకలం రేపింది. దీంతో అప్రమత్తమైన ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముంబైలోని బాంద్రా కుర్లా ప్రాంతంలో ఈ స్కూల్ ల్యాండ్‌లైన్ నంబరుకు మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఓ ఆగంతకుడు ఫోన్ చేశాడు. స్కూల్లో టైం బాంబు పెట్టానని, స్కూల్‌ను పేల్చేస్తానని ఆ కాలర్ బెదిరించి ఫోన్ కట్ చేశాడు. దీంతో పాఠశాల సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన పోలీసులు స్కూల్లో తనిఖీలు చేయగా.. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. స్కూల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆగంతకుడి నుంచి వచ్చిన ఫోన్‌ను ట్రేస్ చేస్తున్నామని, త్వరలోనే అతడిని పట్టుకుంటామని వెల్లడించారు. గతేడాది అక్టోబరులో అంబానీ కుటుంబానికి బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. అంబానీ కుటుంబాన్ని బెదిరిస్తూ రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తోన్న హర్‌కిసాన్‌దాస్ ఆసుపత్రికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. దానిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ నంబరు ఆధారంగా ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. 2020లో అంబానీ నివాసం ఆంటిలియా సమీపంలో పేలుడు పదార్థాలతో కూడిన ఓ స్కార్పియో కారును నిలిపి ఉంచడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వమే భద్రత కల్పిస్తోంది.

లోయలో పడి ముగ్గురు సైనికుల మృతి

శ్రీనగర్: ప్రమాదవశాత్తు ముగ్గురు సైనికులు లోయలో పడి మరణించిన ఘటన జమ్ముకశ్మీర్‌లో జరిగింది. కుప్వారా జిల్లాలోని మచిల్ సెక్టార్‌లో బుధవారం ఈ ఘటన జరిగినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో షెడ్యూల్ ప్రకారం రోజువారీ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్మీ వాహనం ప్రమాదవశాత్తు లోయలోకి జారిపోయిందని అన్నారు. ఈ ప్రమాదంలో జూనియర్ కమిషర్ అధికారి (జేసీఓ) సహా ముగ్గురు సైనికులు మరణించినట్లు తెలిపారు. మచిల్ సెక్టార్‌లోని చినార్ వారియర్ వద్ద ట్రాక్‌పై మంచు అధికంగా ఉండటంతో వాహనం జారి లోయలో పడిందని శ్రీనగర్‌కు చెందిన చినార్ కార్ప్స్ ట్విటర్‌లో పేర్కొంది.

భోజనంలో రాళ్లు... మరో వివాదంలో ఎయిరిండియా

న్యూదిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండియాను కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టినినాటి నుంచి ఆ సంస్థ వివాదాలతో మునిగితేలుతోంది. ప్రయాణికులపై మూత్ర విసర్జన ఘటన మరువక ముందే మరో వివాదస్పద ఘటన వెలుగులోకి వచ్చింది. ఎయిర్ ఇండియా విమానంలో అందజేసిన భోజనంలో రాళ్లు వచ్చాయంటూ ఓ మహిళా ప్రయాణికురాలు ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఫొటోలను ట్విటర్‌లో షేర్ చేస్తూ ఎయిర్‌లైన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 8న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎయిరిండియా విమానంలో తనకు ఈ చేదు అనుభవం ఎదురైనట్లు శార్వప్రియ సంగ్వాన్ అనే మహిళ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ కాస్తా వైరల్ అవడంతో ఎయిరిండియా తీరును తప్పుబడుతూ అనేకమంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. దీంతో తాజా ఘటనపై ఎయిరిండియా స్పందించింది. 'ఇది ఆందోళనకర విషయమే. దీని గురించి కేటరింగ్ టీంతో మాట్లాడుతున్నాం. మీ సమస్యను పరిష్కరించేందుకు కొంత సమయం ఇవ్వండి. దీన్ని మా దష్టికి తీసుకొచ్చినందుకు కృతజ్ఞతలు' అని ఎయిరిండియా ఆమె ట్వీట్‌కు బదులిచ్చింది.

మహిళా న్యాయవాదిపై సామూహిక అత్యాచారం

నిందితులు ఐఏఎస్, మాజీ ఎమ్మెల్యే

పాట్నా: సీనియర్ ఐఏఎస్ అధికారి సంజీవ్ హంస్, ఆర్జేడీ మాజీ ఎమ్మెల్యే గులాబ్ యాదవ్‌లు ఓ మహిళా న్యాయవాదిపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ప్రస్తుతం సంజీవ్ హంస్ బీహార్ ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గులాబ్ యాదవ్ మధుబని జిల్లాలోని ఝంఝర్‌పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే. ధనపూర్‌లోని న్యాయస్థానం ఆదేశాల మేరకు పట్నాలో వీరిపై సామూహిక అత్యాచారం కేసు నమోదైంది. 2021లో ఎమ్మెల్యే, ఐఏఎస్ తనను అత్యాచారం చేశారంటూ ఓ మహిళ రూపస్‌పూర్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కానీ, అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆ మహిళ ధనపూర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రాథమిక దర్యాప్తు చేయమని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. ఆ నివేదిక వచ్చాక న్యాయస్థానం స్పందించి.. ఇప్పుడు పాట్నాలోని రూపస్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. కేసు వివరాలను పట్నా ఎస్ఎస్‌పీ మన్వ్‌జిత్ సింగ్ వెల్లడించారు. "మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, ఐఏఎస్ సంజీవ్ హంస్ అత్యాచారం చేయడంతో గర్భం దాల్చినట్లు హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న ఓ మహిళ 2021లో ధనపూర్ కోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఆమె కోరినట్లు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి న్యాయస్థానం నిరాకరించింది. కానీ, ప్రాథమిక దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను ఏసీపీ కామ్యా మిశ్రకు అప్పగించారు. దర్యాప్తు బృందం దిల్లీ, పుణే, అలహాబాద్‌లోని వివిధ హోటళ్లు, ఆసుపత్రులను సందర్శించి సాక్ష్యాలను సేకరించింది. జూన్‌లో కోర్టుకు నివేదిక సమర్పించింది. కానీ, న్యాయస్థానం ఆరునెలలపాటు ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో బాధితురాలు హైకోర్టును ఆశ్రయించారు. అదే సమయంలో ధనపూర్ న్యాయస్థానం నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది" అని వివరించారు.

అజిత్, విజయ్ అభిమానుల ఘర్షణ

మధురై: కోలీవుడ్ సూపర్‌స్టార్స్ అజిత్, విజయ్ అభిమానుల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో పోలీసులు లాఠీ ఝుళిపించారు. హీరో అజిత్ నటించిన 'తునివు', విజయ్ నటించిన 'వారిసు' చిత్రం బుధవారం విడుదలయ్యాయి. ఎనిమిదేళ్ల తర్వాత ఇద్దరి సినిమాలు ఒకేరోజు విడుదలవడంతో వారి అభిమానులు థియేటర్ల వద్ద సందడి చేశారు. తమిళనాడులోని కోయంబేడులోని రోహిణీ థియేటర్ వెలుపల మంగళవారం అర్ధరాత్రి అజిత్, దళపతి అభిమానులు గొడవకు దిగారు. ఈ గొడవల్లో అజిత్ అభిమానులు విజయ్ నటించిన 'వారిసు' చిత్ర పోస్టర్‌ను.. దళపతి అభిమానులు 'తునివు' చిత్ర పోస్టర్లను చించివేశారు. అభిమానుల మధ్య ఏర్పడిన గొడవ పెరుగుతుండటంతో... సమాచారం తెలుసుకున్న పోలీసులు థియేటర్ వద్దకు చేరుకుని, గుమికూడిన అభిమానులపై లాఠీఛార్జీ చేశారు. ఈ ఒక్క థియేటర్ వద్దే కాదు.. చెన్నైలోని అనేక థియేటర్ల వద్ద అజిత్, విజయ్ అభిమానులు హోర్డింగ్‌లు ధ్వంసం చేయడం, గొడవలకు దిగిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి.

అజిత్ అభిమాని మృతి

'తునివు' విడుదల సందర్భంగా అజిత్ అభిమాని ఒకరు మృతి చెందడంతో విషాదం చోటుచేసుకుంది. అజిత్ సినిమా చూసేందుకు లారీపై వచ్చిన భరత్‌కుమార్ అనే అభిమాని.. రోహిణీ థియేటర్ సమీపంలోకి రాగానే ఉద్వేగంతో లారీపై నుంచి కిందకు దూకాడు. దీంతో అతనికి తీవ్రగాయాలై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భరత్‌కుమార్ 'తునివు' ఒంటిగంట షో చూడడానికి థియేటర్‌కి వస్తున్నట్లు కోయంబేడు పోలీసులు ట్వీట్‌లో పేర్కొన్నారు.

అనీరాజాపై
కేసు కొట్టివేత

న్యూఢిల్లీ: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అనీరాజాకు పాటియాలా కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. సీఏఏ, ఎన్ఆర్సీ, యూఏపీఏకు వ్యతిరేకంగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గతేడాది డిసెంబరు 16న ఆందోళన నిర్వహించిన ఆమెపై నమోదైన కేసును కొట్టివేసింది. అనీరాజాపై ఆరోపణలు రుజువు చేసేందుకు సరిపడ ఆధారాలు పోలీసుల వద్ద లేనందున ఆమెపై కేసును కొట్టివేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. సమ్మె సమయంలో జంతర్ మంతర్ వద్ద నిషేధాజ్ఞలు అమల్లో లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకున్నది. ఈ నేపథ్యంలో అనీరాజాపై విపత్తు నివారణ చట్టం కింద నమోదైన కేసు చెల్లుబాటు కాదని, దీనిని కొట్టివేస్తున్నట్లు పేర్కొంటూ తీర్పు వెలువరించింది.

స్వయం ఉపాధితో సమాజానికి మేలు

చిరు వ్యాపారులకు
రూ.10 వేల జమలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చిరు వ్యాపారులు వారంతట వారే ఉపాధి కల్పించుకుంటూ సమాజానికి కూడా గొప్ప మేలు చేస్తున్నారని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కొనియాడారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్లు కొత్త రుణాలు అందించడంతో పాటు గత 6 నెలల రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను బుధవారం క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరు వ్యాపారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే పెట్టుబడి సాయం కింద కోసం రూ.10 వేలు సాయం చేస్తున్నామన్నారు. ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో తోపుడు బండ్ల మీద కూరగాయలు, పండ్లు, వస్తువులు, ఆహార పదార్థాలు అమ్ముకుని జీవించే వారు, రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, గంపలు, బుట్టలతో వస్తువులు అమ్మేవారు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునేవారితో పాటు చేనేతలు, సాంప్రదాయ చేతివృత్తుల కళాకారులు, ఇత్తడి పనిమీద బతికేవారు, బొబ్బిలి వీణ వంటివి తయారు చేసేవారు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కళంకారీ, తోలు బొమ్మలు, లేస్ వర్కర్లు అందరికీ సున్నా వడ్డీ పథకం కింద రూ.10 వేలు ఎలాంటి గ్యారంటీ అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకులను ఒప్పించి వారికి ఇప్పించే కార్యక్రమం చేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. వారి వడ్డీని కట్టే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుందని, రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ బ్యాంకులు వారికి తిరిగి రుణాలు ఇస్తాయని సీఎం ఈ పథకం ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో 24.06 లక్షల రుణాలు ఇచ్చే గొప్ప కార్యక్రమం అన్నారు. రుణాలు పొందిన వారిలో దాదాపు 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలే ఉన్నారని తెలిపారు. దాదాపు 15.31 లక్షల కుటుంబాలకు ఈ మేలు చేయగలిగామని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఇతర ఉన్నతాధికారులు, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ (ఏపీ) నవనీత్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మానను మంత్రివర్గం నుంచి తొలగించాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీనియర్ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో ప్రాంతీయ తత్వాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, తక్షణమే సీఎం జగన్ స్పందించి ఆయనను కేబినెట్ నుంచి తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖను రాజధానిగా అంగీకరించకుంటే, విశాఖను ప్రత్యేక రాష్ట్రం చేయాలని కోరతామనడం ఆయన దిగజారుడుకు నిదర్శనమని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...ఆంధ్రప్రదేశ్ రాజధానిపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధర్మంగా మాట్లాడం ఏ మాత్రం సమంజసనీయం కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ రెవెన్యూ మంత్రిగా ధర్మాన పనిచేశారనీ గుర్తుచేశారు. సీనియర్ మంత్రి అయిన ధర్మాన అమరావతి రాజధాని అంశంపై చేస్తున్న వ్యాఖ్యలు సహేతుకంగా లేవన్నారు. అమరావతిని రాజధానిగా గత ప్రభుత్వం ప్రకటించినప్పుడు వ్యతిరేకించకుండా ఇప్పుడు ఈ తరహా వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం జగన్‌కు రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే కేబినెట్ నుంచి ధర్మాన ప్రసాదరావును తొలగించాలన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ పక్షాన బుధవారం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై సీఎం జగన్‌కు ఎస్టీయూ తరపున హెచ్.తిమ్మన్న వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండరును సీఎంకు అందజేశారు. పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దుపై వెంటనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. కేజీబీవీ టీచర్లకు 2016 నుంచి పెంచకుండా ఉన్న జీతాన్ని కనీస వేతనం ద్వారా పెంచాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, పాఠశాలలో బోధనకు ఆటంకంగా ఉన్నటువంటి వివిధ యాప్‌లను రద్దు చేయాలనీ, లేదా వాటి నిర్వహణకుగాను బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. అన్ని విభాగాల ఉపాధ్యాయ పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. డీఈవో పూల్‌లో ఉన్న 1380 భాషా పండితులకు (ఎల్‌పీ) స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ఇవ్వాలని, ప్రాథమిక విద్యకు ఇబ్బందికరంగా ఉన్న 3, 4, 5 తరగతుల పాఠశాలల విలీనాన్ని ఉప సంహరించుకోవాలని తదితర డిమాండ్లతో ఎస్టీయూ నేతలు వినతిపత్ర ఇచ్చారు. ఎస్టీయూ నేతలతోపాటు ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, ఏపీఎన్జీవోస్ సెక్రటరీ జనరల్ శివారెడ్డి తదితరులున్నారు.

పృథ్వీ-2 క్షిపణి పరీక్ష విజయవంతం

బాలాసోర్: భారత్ అమ్ముల పొదిలో మరో అస్త్రం వచ్చి చేరింది. దేశీయంగా అభివృద్ధి చేసిన బాలిస్టిక్ క్షిపణి పృథ్వీ-2ని మంగళవారం రాత్రి ఒడిశాలోని చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. పృథ్వీ-2 క్షిపణి భారతదేశం అణు నిరోధకంలో అంతర్భాగంగా ఉంది. క్షిపణి తన లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేధించిందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. వినియోగదారు శిక్షణా ప్రయోగం క్షిపణికి సంబంధించిన అన్ని కార్యాచరణ, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా ధ్రువీకరించిందని తెలిపింది. పృథ్వీ-2 ఉపరితలం నుంచి ఉపరితలం పైకి ప్రయోగించే, తేలికపాటి రెండు ఇంజన్‌లతో నడిచే ఈ క్షిపణి దాదాపు 350 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేధిస్తుందని వెల్లడించింది. 500-1,000 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇది అధునాతన జడత్వ నావిగేషన్ సిస్టమ్‌ను ఉపయోగిస్తుందని వివరించింది.

హజ్‌కు ముందే కాలికట్ విమానాశ్రయాన్ని పునరుద్ధరించాలి
ప్రధాని మోదీకి సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం లేఖ

న్యూఢిల్లీ: కేరళ, కోజికోడ్‌లోని కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హజ్ యాత్రికులను తీసుకెళ్లే పెద్ద విమానాలు దిగేందుకు వీలుగా అభివృద్ధి జరగాలని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం సూచించారు. ఈ మేరకు విమానాశ్రయం అభివృద్ధి గురించి చర్చించేందుకు సంబంధిత మంత్రిత్వశాఖలు, అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీకి సూచిస్తూ ఆయన బుధవారం లేఖ రాశారు. భారతీయుల హజ్ కోటాను పెంచుతూ సౌదీ అరేబియా తీసుకున్న తాజా నిర్ణయం దృష్ట్యా ఈ విమానాశ్రా యాన్ని అభివృద్ధి చేయాలని, డిపార్చర్ పాయింట్లలో ఒకటిగా కోజికోడ్‌లోని కరిపూర్ విమానాశ్రయం ఉన్నదని ప్రధానిని కోరారు. హజ్ యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా కరిపూర్ ఎయిర్ పోర్టులో తగిన ఏర్పాట్లను అధికారులు జాగ్రత్తగా చేశారా అన్నది సందేశాత్మకమని వినయ్ విశ్వం పేర్కొన్నారు. విమానాశ్రయంలో రన్‌వే పనులు నత్తనడకన సాగుతు న్నాయని, అవి పూర్తి అయితే తప్ప పెద్ద విమానాలు రాకపోకలు సాగించలేవన్నారు. లేనిపక్షంలో అనేక చిన్న విమానాలు ఇక్కడ నుంచే నడవాల్సి ఉంటుందని తెలిపారు. '2020 ఆగస్టు 7న ఎయిర్‌పోర్ట్ టేబుల్‌టాప్ రన్‌వేపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రమాదానికి గురి కాగా 21 మంది మరణించారు. దీంతో బోయింగ్ 747, ఎయిర్‌బస్ ఎ350 వంటి విమానాలు ఈ విమానాశ్రయంలో దిగకుండా పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నిషేధం విధించింది. రన్‌వే పునరుద్దరణ పనులు జరుగుతున్నాయి' అని వినయ్ విశ్వం పేర్కొన్నారు. వివిధ మంత్రిత్వశాఖలు, ఏజెన్సీలు కలిసికట్టుగా పనిచేస్తే తప్ప జూన్ నాటికి పనులు పూర్తి కాలేవని, జూన్‌లో హజ్ యాత్ర మొదలవుతుందని విశ్వం నొక్కిచెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో హజ్‌కు సంబంధించిన మంత్రిత్వశాఖల సమావేశాన్ని నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వడం అవసరమని ప్రధానికి సూచించారు. కరిపూర్ విమానాశ్రయం అభివృద్ధికి సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ అన్ని విషయాలను తెలిపేందుకే లేఖ రాసినట్లు ప్రధానికి తెలిపారు. కాగా, కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్నే కోజికోడ్ ఎయిర్‌పోర్టు లేక కారిపూర్ ఎయిర్‌పోర్టు అంటారు. ఇది కేరళలోని మల్లప్పురం జిల్లాలో ఉంది. కోజికోడ్, మల్లప్పురం, వాయనాడ్, పలక్కాడ్‌తో కూడుకున్న మలబార్ ప్రాంతంలో సేవలు అందిస్తున్నది.

లక్షద్వీప్ ఎన్‌సీపీ ఎంపీకి పదేళ్ల జైలు

న్యూఢిల్లీ: హత్యాయత్నం కేసులో లక్షద్వీప్ ఎంపీ మహమ్మద్ ఫైజల్ సహా నలుగురికి లక్షద్వీప్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2009లో నమోదయిన హత్యాయత్నం కేసులో నిందితులకు కవరత్తిలోని జిల్లా, సెషన్స్ కోర్టు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా కూడా విధించిందని కేసుకు సంబంధించిన న్యాయవాదులు తెలిపారు. న్యాయవాదుల ప్రకారం, 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజకీయ సమస్యపై జోక్యం చేసుకున్నందుకు తమ పొరుగు ప్రాంతానికి చేరుకున్న కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ అల్లుడు పదనాథ్ సలీహ్‌పై ఎంపీ, ఇతరులు దాడి చేశారు. దీనిపై పీటీఐతో మాట్లాడిన ఫైజల్... ఇది 'రాజకీయ ప్రేరేపిత' కేసు అని, త్వరలో ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తానని చెప్పారు. అయితే, ఈ కేసులో శిక్షా కాలం రెండేళ్ల కంటే ఎక్కువ ఉన్నందున ఆయన లోక్‌సభకు అనర్హులుగా ప్రకటించబడతారు. కేంద్ర పాలిత ప్రాంత అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ ఖోడా పటేల్ ప్రకటించిన కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా చెలరేగిన నిరసనలకు ప్రధాన నిర్వాహకుల్లో ఫైజల్ ఒకరు.

నాటునాటుకు అవార్డుపై ప్రముఖుల ప్రశంసలు

హైదరాబాద్: ఆర్ఆర్ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ప్రతిష్ఠాత్మక పురస్కారం 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు అందడంపై అగ్రకథానాయకుడు, మెగాస్టార్ చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఇదొక చారిత్రక విజయమంటూ.. దీనిపట్ల దేశం గర్విస్తోందన్నారు. ఈమేరకు సంగీత దర్శకుడు కీరవాణి, ఇతర చిత్ర బృందాన్ని మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు. 'ఇదొక అద్భుతమైన, చారిత్రక విజయం. ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటునాటు'కి గానూ కీరవాణి గోల్డెన్‌గ్లోబ్ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు నా అభినందనలు. దేశం మిమ్మల్ని చూసి గర్విస్తోంది. సంగీతం, డ్యాన్స్.. ఈ రెండింటి పండగే 'నాటునాటు'. మన దేశమే కాదు ప్రపంచం మొత్తం ఈరోజు మీతో కలిసి డ్యాన్స్ చేస్తోంది. చరణ్, తారక్‌తోపాటు అద్భుతమైన సాహిత్యం అందించిన చంద్రబోస్, ఉర్రూతలూగించేలా ఆలపించిన రాహుల్, కాలభైరవ, కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్‌కు కంగ్రాట్స్" అని పేర్కొన్నారు. ఈ పాటకు అవార్డు రావడంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్ర, ప్రధాని మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, నటులు ఎన్టీఆర్, మోహన్ బాబు, నాగార్జున, రవితేజ, 'అల్లరి' నరేశ్, విష్ణు మంచు, సంగీత దర్శకులు ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, దేవీశ్రీ ప్రసాద్, నటి అనుష్క, డైరెక్టర్లు క్రిష్, నందినీ రెడ్డి, రామ్‌గోపాల్ వర్మ, రాహుల్ రవీంద్రన్ శుభాకాంక్షలు తెలిపారు.



ఆస్కార్ బరిలో 'కాంతారా'

బెంగళూరు: గతేడాది అనేక దక్షిణాది సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో అలరించిన విషయం తెలిసిందే. అందులో.. 'ఆర్ఆర్ఆర్', 'కేజీయఫ్ ఛాప్టర్ 2', 'కాంతారా' ఉన్నాయి. వీటిలో 'కాంతారా' అయితే ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రంలో రిషబ్ శెట్టి హీరోగా నటించడంతోపాటు దర్శకత్వం వహించాడు. కేవలం రూ.16 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.400 కోట్ల వసూళ్లు సాధించింది. కర్ణాటకలోని మంగుళూరుకు చెందిన 'భూతకోల' ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు కనెక్ట్ అయిపోయారు. ముఖ్యంగా సినిమా చివరి 20 నిమిషాల్లో రిషబ్ శెట్టి నటనకి ముగ్ధులయి పోయారనే చెప్పాలి. దీంతో ఎటువంటి ప్రచారం లేకుండా కేవలం మౌత్ టాక్‌తోనే మంచి విజయాన్ని సాధించింది. తాజాగా ఈ సినిమా మరో ఘనత సాధించింది. అది కూడా చాలా సైలెంట్‌గా. 'ఆస్కార్' అవార్డులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ తెలిసిందే. ప్రతి మూవీ టెక్నీషియన్ ఒక్కసారైనా ఆ అవార్డుని అందుకోవాలని ఉవ్విళ్లూరుతారు. 'ఆస్కార్ 2023'కి 'కాంతారా' సినిమా రెండు విభాగాల్లో కంటెస్టేషన్ లిస్ట్‌లో చోటు సాధించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో టాప్-15 జాబితాలో ఈ చిత్రం నిలిచింది. టాప్-5లో నిలుస్తుందో లేదో చూడాలి. ఈ విషయాన్ని తెలుపుతూ.. 'కాంతారా' నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సోషల్ మీడియాలో ఓ ట్వీట్ చేసింది. అందులో.. 'కాంతారా'కి రెండు ఆస్కార్ అర్హతలు లభించినందుకు ఆనందంగా ఉంది. మాకు మద్దతుగా నిలిచిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అందరి మద్దతుతో ఈ ప్రయాణాన్ని పంచుకోవడం సంతోషంగా ఉంది. ఆస్కార్‌లో మెరవడానికి ఎదురుచూస్తున్నాం' అని రాసుకొచ్చింది. కాగా.. ఇప్పటి వరకూ గుజరాతీ చిత్రం 'ది ఛెల్లో షో', టాలీవుడ్ చిత్రం 'ఆర్ఆర్ఆర్' మాత్రమే ఆస్కార్ బరిలో ఉన్నాయని అందరూ అనుకున్నారు. సడెన్‌గా ఈ లిస్ట్‌లో 'కాంతారా' చేరడం విశేషం.

దర్శకుడిగా విజయ్ కుమారుడు

చెన్నై: సెలబ్రిటీల వారసులందరూ తమ తల్లిదండ్రుల బాటలోనే పయనిస్తుంటారు. సినిమా ఇండస్ట్రీ అందుకు మినహాయింపు ఏమీ కాదు. స్టార్ కిడ్స్ అందరూ సినిమా రంగంలోనే స్థిరపడుతుంటారు. కొన్ని రోజుల క్రితమే షారూఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ మెగాఫోన్ పట్టుకున్న సంగతి తెలిసిందే. ఇదే బాటలో కోలీవుడ్ స్టార్ హీరో కుమారుడు పయనించబోతున్నట్లు తెలుస్తోంది. డైరెక్టర్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. కోలీవుడ్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసే నటుడు ఇళయ దళపతి విజయ్. అతడి కుమారుడు జేసన్ సంజయ్ విదేశాల్లో చదువుకుంటున్నాడు. తండ్రి బాటలోనే నడుస్తూ అతడు హీరోగా మారతాడని అందరు అనుకున్నారు. కానీ, సంజయ్‌కు మాత్రం నటించడం ఇష్టం లేదట. గతంలో ఓ మలయాళీ డైరెక్టర్ నటించమని అడగగా అందుకే జేసన్ నిరాకరించాడట. విజయ్ తండ్రి ఎస్.ఎ. చంద్రశేఖర్ తాజాగా మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. తన మనవడికి డైరెక్షన్ అంటే ఇష్టమని చెప్పాడు. 'విజయ్ కుమారుడు సంజయ్‌కు దర్శకత్వంపై మక్కువ ఎక్కువ. అతడు డైరెక్టర్‌గా మారితే విజయ్ సేతుపతితో సినిమా చేస్తాడట. అనంతరం తన తండ్రితో చిత్రాన్ని తెరకెక్కిస్తాడట. ఈ విషయాన్ని గతంలో ఒకసారి నాతో చెప్పాడు" అని విజయ్ తండ్రి చంద్రశేఖర్ తెలిపాడు.

పంత్ లేకపోవడం
దిల్లీకి లోటే: గంగూలీ

కోల్‌కతా: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన రిషభ్ పంత్ ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌కు అందుబాటులో ఉండటం లేదు. దిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఉన్న పంత్ ఐపీఎల్ ఆడకపోవడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతుందని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. ఇటీవల పంత్‌కు కోకిలాబెన్ అంబానీ ఆసుపత్రిలో మోకాలి లిగ్మెంట్‌కు శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. గాయాలు మాని పంత్ పూర్తిగా కోలుకోవడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుంది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ మార్చి ఆఖరి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దిల్లీ క్యాపిటల్స్‌కి రిషభ్ పంత్ స్థానంలో డేవిడ్ వార్నర్ జట్టు సారథ్య బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పంత్ ఐపీఎల్‌కు దూరమవ్వడం దిల్లీ జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతుందని సౌరభ్ గంగూలీ వెల్లడించాడు. "రిషభ్ పంత్ పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుంది. అది అనుకోకుండా జరిగిన ప్రమాదం. అందువల్ల మనం ఏమీ చేయలేం. పంత్ ఐపీఎల్‌కి అందుబాటులో ఉండడు. దిల్లీ క్యాపిటల్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నాను. పంత్ లేకపోవడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కానీ మేం గొప్పగా రాణించడానికి ప్రయత్నిస్తాం" అని గంగూలీ పేర్కొన్నాడు. గతేడాది అక్టోబరులో గంగూలీ బీసీసీఐ అధ్యక్ష పదవి నుంచి వైదొలిన విషయం తెలిసిందే. గంగూలీ దిల్లీ ఫ్రాంచైజీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమవుతున్నాడు.

సొంత రికార్డును బద్దలు కొట్టిన ఉమ్రాన్

న్యూఢిల్లీ: భారత పేసర్ ఉమ్రాన్ మాలిక్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకొన్నాడు. అయితే ఎవరి పేరు మీదో ఉన్న రికార్డు కాదు సుమా... తన రికార్డు తానే బద్దలు కొట్టుకున్నాడు. శ్రీలంకతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో ఏకంగా 156 కిలోమీటర్ల వేగంతో బంతిని సంధించి భారత్ ఫాస్టెస్ట్ బౌలర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇన్నింగ్స్‌లోని 14వ ఓవర్‌లో ఉమ్రాన్ ఈ ఫీట్‌ను సాధించాడు. ఇటీవల శ్రీలంకతో మొదటి టీ20లోనూ 155 కి.మీ వేగంతో బంతిని విసిరిన సంగతి తెలిసిందే. దీంతో బుమ్రా పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో ఉమ్రాన్ 8 ఓవర్లలో మూడు వికెట్లు తీసి 57 పరుగులు ఇచ్చాడు. ఉమ్రాన్ మాలిక్, బుమ్రా తర్వాత అత్యంత వేగవంతమైన బౌలర్ మహమ్మద్ షమీ (153.3 కి.మీ) కాగా.. నవ్‌దీప్ సైని (152.85 కి.మీ) నాలుగో స్థానంలో నిలిచాడు. ఇక ఐపీఎల్‌లో ఉమ్రాన్ హైదరాబాద్ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత సీజన్‌లో దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 157 కిలోమీటర్ల వేగంతో బంతిని విసిరాడు. అయితే ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ బంతిని విసిరిన బౌలర్‌గా లాకీ ఫెర్గూసన్ (157.3 కి.మీ) పేరిట రికార్డు ఉంది. అంతర్జాతీయంగా మాత్రం పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ (161.3 కి.మీ) వేగవంతమైన బౌలర్. ఇక శ్రీలంకపై తొలి వన్డేలో భారత్ 67 పరుగుల తేడాతో విజయం సాధించి.. 1-0 సిరీస్ ఆధిక్యాన్ని సంపాదించింది.

లంక చెత్త బౌలింగ్‌లో కోహ్లి సెంచరీ

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లిపై మాజీ ఓపెనర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ మళ్లీ నోరు పారేసుకున్నాడు. శ్రీలంక చెత్త బౌలింగ్ కారణంగానే కోహ్లి సెంచరీ చేయగలిగాడని తెలుపుతూ.. అతన్ని తక్కువ చేసే ప్రయత్నం చేశాడు. వీలు చిక్కినప్పుడల్లా విరాట్‌కు వ్యతిరేకంగా ఏదో ఒక విమర్శ చేసే గంభీర్.. తాజాగా అదే రీతిలో మాట్లాడాడు. శ్రీలంకతో తొలి వన్డేలో సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లి కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించాడు. దాంతో కింగ్ కోహ్లిపై సర్వత్రా ప్రశంసలు జల్లు కురిస్తోంది. వన్డే ఫార్మాట్‌లో 45వ సెంచరీ బాదిన విరాట్.. సచిన్ టెండూల్కర్ 100 శతకాల రికార్డును అధిగమిస్తాడని మాజీ క్రికెటర్లు, అభిమానులు జోస్యం చెప్పారు. అయితే భారత క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్‌తో విరాట్ కోహ్లిని పోల్చడం సరైంది కాదని గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. సచిన్ ఆడిన పరిస్థితులకు ఇప్పటికీ చాలా మార్పులు ఉన్నాయని తెలిపాడు. 'ఒకరి రికార్డులను మరొకరితో పోల్చడం సరైంది కాదు. వన్డే ఫార్మాట్‌లో సచిన్ టెండూల్కర్ 49 వన్డే సెంచరీల కంటే విరాట్ కోహ్లి ఎక్కువ సెంచరీలు సాధించే అవకాశం ఉంది. అయితే అప్పుడు, ఇప్పుడు నిబంధనలు చాలా మారిపోయాయి. గతంలో ఒకే కొత్త బంతిని తీసుకొనే అవకాశం ఉండేది. ఇప్పుడు రెండు బంతులు తీసుకుంటున్నారు. అలాగే సర్కిల్‌లో ఐదుగురు ఫీల్డర్లు ఉంటున్నారు. అయితే విరాట్ కోహ్లి మాత్రం అద్భుతమైన ఆటగాడు. అందులో ఎలాంటి సందేహం లేదు.'అని గంభీర్ తెలిపాడు. అంతేగాక 'శ్రీలంక బౌలింగ్ మరీ ఆర్డినరీగా ఉంది. టీమిండియా టాప్-3 ఎంత ఈజీగా బ్యాటింగ్ చేశారో చూడండి. రోహిత్-కోహ్లిలతో పాటు కొత్త కుర్రాడు శుభమన్ గిల్ కూడా చాలా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో లంక బౌలింగ్ నన్ను తీవ్రంగా నిరాశకు గురి చేసింది.'అని చెప్పుకొచ్చాడు. ఇక విరాట్ కోహ్లి తక్కువ చేస్తూ గంభీర్ చేసిన వ్యాఖ్యలపై అతని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. కోహ్లిని ఎప్పుడూ ఏదో ఒకటి అనకుంటే గంభీర్‌కు పొద్దు పోదని, తన అసూయను ఇలా బయటపెడుతున్నాడని కామెంట్ చేస్తున్నారు. గంభీర్ వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.